RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 195 | ఆగస్టు 15 శనివారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 195 | August 15 Saturday2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం 2

## భారత్ సహనాన్ని బలహీనతగా భావించవద్దు

### ‘ఆపరేషన్ సింధూర్’ ఇంటర్వ్యూలో అజిత్ దోభాల్ హెచ్చరిక



**న్యూఢిల్లీ జనసంఘర్షణ :** భారతదేశ సహనాన్ని ఎవరూ బలహీనతగా భావించి పొరపాటు చేయకూడదని జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోభాల్ స్పష్టం చేశారు. ‘ఆపరేషన్ సింధూర్’ నేపథ్యంలో నిర్మించిన ప్రత్యేక డాక్యుమెంటరీ సిరీస్‌లో భాగంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సింధూర్‌పై ఎన్ఎస్ఏ అజిత్ దోభాల్ ఒక ముఖాముఖిలో మాట్లాడటం ఇదే తొలిసారి కావడం గమనార్హం. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం భారత్ చేపట్టిన ఈ సైనిక చర్యకు సంబంధించిన పలు కీలక అంశాలను ఆయన ఈ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ఆపరేషన్ సింధూర్ లక్ష్యాలను ముందస్తు ప్రణాళిక ప్రకారమే నిర్దేశించుకున్నామని దోభాల్ తెలిపారు. పహల్గామ్ దాడి వెనుక ఉన్న ఉగ్రవాద

➤ మిగతా 2వ పేజిలో..

## తెలంగాణ అభివృద్ధి, సంక్షేమానికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్

### డిసెంబర్‌లో ‘తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0’



**హైదరాబాద్ జనసంఘర్షణ** రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ప్రతిష్టాత్మక ‘తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0’ నిర్వహణకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో గురువారం సుదీర్ఘంగా జరిగిన మంత్రివర్గ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. భేటీ అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ రఘురామిరెడ్డిలతో కలిసి మీడియాకు కేబినెట్ నిర్ణయాలను వెల్లడించారు. ఈసారి ప్రత్యేకంగా ‘ఇన్వెస్ట్ తెలంగాణ’ అనే థీమ్‌తో సమ్మిట్‌ను ప్లాన్ చేస్తున్నామని, డిఫెన్స్, ఏరోస్పేస్, ఫార్మా రంగాల్లో ప్రాజెక్టులతో పాటు ‘ఫ్యూచర్ సిటీ’ ప్రణాళికలను ప్రపంచానికి చాటిచెప్పేలా ఎగ్జిబిషన్, ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సదస్సు నిర్వహణ పర్యవేక్షణకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్ వెంకటస్వామిలతో కూడిన సబ్ కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. హైదరాబాద్ నగరాన్ని హరిత నగరంగా మార్చే క్రమంలో కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోలను విద్యుత్ వాహనాలుగా (ఈవీ) మార్చేందుకు రూ. 200 కోట్లతో ప్రత్యేక పథకాన్ని అమలు చేయాలని కేబినెట్ తీర్మానించింది. ఈ పథకం కింద అర్హులైన ఆటో డ్రైవర్లకు ఒక్కో వాహనానికి గరిష్టంగా రూ. 1.50 లక్షల సబ్సిడీని ప్రభుత్వం అందించనుంది. దీనికితోడు నగర పరిధిలోని కాలుష్య కారక పరిశ్రమలను శివార్లకు తరలించేందుకు ఉద్దేశించిన ‘హిల్ట్ పాలసీ’ దరఖాస్తుల గడువును పరిశ్రమల విజ్ఞప్తి మేరకు అక్టోబర్ 31 వరకు పొడిగించారు. అలాగే ‘సిటిజన్స్ అర్బన్ రీస్ట్రక్చరింగ్ అండ్ ఎకానమీ’ ప్రాజెక్ట్ పరిధిలో అర్హులైన పేద, మధ్యతరగతి వర్గాలకు నిర్మించతలపెట్టిన ఇందిరమ్మ ఇళ్లకు భూకేటాయింపులు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని

➤ మిగతా 2వ పేజిలో..

## విద్యార్థులకు నిరసన తెలిపే హక్కు ఉంది

### నల్సార్ ఘటనపై బీసీఐ జోక్యంపై సుప్రీంకోర్టు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అసహనం



**న్యూఢిల్లీ జనసంఘర్షణ :** ప్రజాస్వామ్యంలో విద్యార్థులకు నిరసన తెలిపే ప్రాథమిక హక్కు ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని నల్సార్ (చీూూుూ=) లా యూనివర్సిటీకి చెందిన 2026 బ్యాచ్ గ్రాడ్యుయేషన్ విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ)ని తీవ్రంగా ఆదేశించారు. ఈ వ్యవహారం తనకు, విద్యార్థులకు మధ్య జరిగిన విషయమని.. ఇందులో బీసీఐ అనవసరంగా జోక్యం చేసుకోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నల్సార్ లా విశ్వవిద్యాలయ స్నాతకోత్సవానికి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌ను ఆహ్వానించవద్దంటూ కొందరు విద్యార్థులు లేఖ రాసినట్లు వచ్చిన వార్తలపై బీసీఐ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. బీసీఐ తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు, నల్సార్ 2026 బ్యాచ్ లా విద్యార్థులెవరినీ న్యాయవాదులుగా ఎన్‌రోల్ (నమోదు) చేసుకోవద్దని దేశవ్యాప్తంగా ఉన్న బార్ కౌన్సిళ్లకు బీసీఐ ఛైర్మన్ మనన్ కుమార్ మిశ్రా గురువారం లేఖ రాశారు. ఈ సర్క్యులర్‌పై న్యాయవర్గాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ూజదీూ) అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ స్పందిస్తూ.. రాజ్యాంగబద్ధమైన సంస్థతో విభేదించినంత మాత్రాన, ఒక విద్యార్థి యొక్క న్యాయవాద

➤ మిగతా 2వ పేజిలో..

## రాజ్యాంగాన్ని గౌరవించాలి..

### ‘వికసిత్ భారత్’ లక్ష్యంగా ముందుకు సాగాలి: జాతిని ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగం

**న్యూఢిల్లీ జనసంఘర్షణ** భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని, ‘వికసిత్ భారత్’ లక్ష్య సాధన కోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. దేశంలో సాధిస్తున్న అభివృద్ధి ఫలాలు సమాజంలోని చివరి వ్యక్తి వరకు అందాలని ఆమె ఆకాంక్షించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని కోరారు. స్వాతంత్ర్య దినోత్సవ శుభసందర్భాన్ని పురస్కరించుకుని జాతిని ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడిన రాష్ట్రపతి, దేశానికి రాజ్యాంగమే అసలైన దిక్సూచి అని స్పష్టం చేశారు. న్యాయ వ్యవస్థను, ప్రజాస్వామ్య చట్టసభలను పౌరులంతా గౌరవించాలని

➤ మిగతా 2వ పేజిలో..



## ‘జనగణన-2027’పై కేంద్ర హోంశాఖ కీలక నోటిఫికేషన్

**40 ప్రశ్నలతో జాబితా విడుదల**

**న్యూఢిల్లీ జనసంఘర్షణ :** దేశవ్యాప్తంగా చేపట్టబోయే ‘జనగణన-2027’కి సంబంధించి కేంద్ర హోంశాఖ గురువారం ఒక కీలక నోటిఫికేషన్ విడుదల చేసింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో తొలిసారిగా సమగ్ర కుల గణనను నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ముమ్మర ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇందులో భాగంగా జనాభా లెక్కల సేకరణలో పౌరులను అడిగే 40 ముఖ్యమైన ప్రశ్నలతో కూడిన జాబితాను ‘రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా’ అధికారికంగా నోటిఫై

➤ మిగతా 2వ పేజిలో..

# తెలంగాణ అభివృద్ధి, సంక్షేమానికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్

**మొదటిపేజీ తరువాయి.** ప్రభుత్వం నిర్ణయించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా 62 లక్షల రేషన్ కార్డులను మంజూరు చేయడంతో లబ్ధిదారుల సంఖ్య 3.42 కోట్లకు చేరిందని మంత్రి పొంగులేటి తెలిపారు. ఇక విద్యా రంగంలో సంస్కరణల్లో భాగంగా ప్రస్తుతం సాంకేతిక విద్యాశాఖ పరిధిలో ఉన్న ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలను 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' పరిధిలోకి తీసుకెళ్లేందుకు తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట్‌లో మార్పులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. తొలివిడతగా రాష్ట్రంలో నిర్మించతలపెట్టిన 113 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లలో భాగంగా, కొత్తగా మరో 7 నియోజకవర్గాల్లో స్కూళ్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో మొత్తం అనుమతులు పొందిన స్కూళ్ల సంఖ్య 86కి చేరింది.

వ్యవసాయం మరియు నీటిపారుదల రంగానికి సంబంధించి వానాకాలం సీజన్‌లో ఏడు రకాల సన్న ధాన్యం సాగును ప్రోత్సహించేలా రైతు వేదికల ద్వారా అవగాహన కల్పించాలని, సాగు చేసే రైతులకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ చెల్లించాలని కేబినెట్ నిశ్చయించింది. మరోవైపు పాలమూరు జిల్లా పరిధిలోని మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల ఫేజ్-2 పనుల కోసం రూ. 2,100 కోట్ల అంచనా వ్యయానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు లక్ష ఎకరాలకు సాగునీరు అందడమే కాకుండా తాగునీరు, పారిశ్రామిక అవసరాలు తీరనున్నాయి. దీంతో పాటు గూడెం దొడ్డి పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1.19 టీఎంసీల నుంచి 15 టీఎంసీలకు పెంచడం, సోలార్ విద్యుత్ ఉత్పత్తి అవకాశాలపై అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్ నియామకానికి మంత్రివర్గం అంగీకారం తెలిపింది.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం

**సంగారెడ్డిలో ఆవిష్కరించనున్న సీఎం రేవంత్ రెడ్డి**

**సంగారెడ్డి:**
తెలంగాణలో ప్రజా పంపిణీ వ్యవస్థ (గ్రాణా) మరింత ఆధునికంగా, పారదర్శకంగా మారనుంది. గత 12 ఏళ్లుగా కేవలం పేపర్/జిరాక్స్ ప్రతులపైనే ఆధారపడుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్న లబ్ధిదారుల నిరీక్షణకు తెరదించుతూ, రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త హంగులతో పీవీసీ (గ్రాంజ) స్మార్ట్ రేషన్ కార్డులను అందుబాటులోకి తెచ్చింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సంగారెడ్డిలో జరిగే భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ కార్డుల పంపిణీ లాంఛనంగా ప్రారంభం కానుంది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయగా, స్థానిక కాంగ్రెస్ నాయకుడు జగ్గారెడ్డి ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. ఇదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు లబ్ధిదారులకు కార్డులు అందజేయనున్నారు.

ఈ నూతన స్మార్ట్ రేషన్ కార్డులను ఎలాంటి ట్యాంపరింగ్‌కు తావులేకుండా ఏటీఎం, పాన్ కార్డ్ మాదిరిగా అత్యంత సురక్షితమైన డిజిటలైజేషన్ మరియు స్మార్ట్ టెక్నాలజీ ఆధారంగా రూపొందించారు. చిప్, క్యూఆర్ కోడ్, బార్‌కోడ్, డిజిటల్ వెరిఫికేషన్ వంటి భద్రతా ఫీచర్లు పొందుపరచడం వల్ల డూప్లికేట్ లేదా బోగస్ కార్డులు సృష్టించడానికి వీలుండదు. కార్డు ముందరి భాగంలో కుటుంబ యజమాని ఫోటో, రేషన్ కార్డు నంబర్, కేటాయించిన రేషన్ దుకాణం నంబర్ ముద్రించి ఉండగా, వెనుక భాగంలో కుటుంబ సభ్యుల వివరాలు ఉంటాయి. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే కుటుంబ సభ్యుల పూర్తి సమాచారం తెరపై కనిపిస్తుంది.

ప్రస్తుతం బయోమెట్రిక్ ద్వారా రేషన్ సరుకులు పొందుతున్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్న నేపథ్యంలో, ఈ స్మార్ట్ కార్డుల ద్వారా రాష్ట్రంలోని ఏ రేషన్ దుకాణం నుంచైనా సరుకులు అత్యంత సులభంగా పొందే అవకాశం కలుగుతుంది. ప్రస్తుతం రేషన్ కార్డులు కలిగిన లబ్ధిదారులు తమ పాత కార్డును స్థానిక రేషన్ దుకాణంలో చూపించి కొత్త స్మార్ట్ కార్డును పొందవచ్చు. అంతేకాకుండా, టీఎస్ఈపాస్ (ఖావుూయిూ) వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని కూడా ఈ స్మార్ట్ రేషన్ కార్డులను పొందే సౌకర్యాన్ని పౌరసరఫరాల శాఖ అందుబాటులోకి తెచ్చింది.

## రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు సరికాదు

**పార్టీ వేదికల్లో మాత్రమే చెప్పాలి**

**పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**

**హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీలో సీఎం సహా ఎవరికైనా ఒకటే గౌరవం ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి కూడా అదే గౌరవం ఇస్తున్నామని చెప్పారు. రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మహేశ్‌కుమార్‌గౌడ్ స్పందించారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు.

'కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆవేదన, ఆందోళనను అర్థం చేసుకుంటాం. పార్టీకి సంబంధించి నాలుగు గోడల మధ్య చర్చించాల్సిన అంశాలను బహిరంగంగా మాట్లాడకూడదని హితవు పలికారు. రాజగోపాల్‌రెడ్డి ప్రజా నాయకుడు.. నాకు మంచి మిత్రుడు. గీత దాటి మాట్లాడకూడదు.. ఆయన అలా మాట్లాడటం సరికాదు. సమయం వచ్చినప్పుడు అవకాశాలు ఉంటాయి. ఏం మాట్లాడినా అధిష్ఠానం దృష్టికి వెళ్తుంది. బిల్లుల విషయంలో ఒక క్రమపద్ధతిలో ముందుకెళ్తున్నాం. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో గత ప్రభుత్వం మాదిరిగా మేం చేయట్లేదని మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. తెలంగాణ ఉద్యమానికి, కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేనివాళ్లు ప్రభుత్వంలో అధికారాన్ని అనుభవిస్తున్నారంటూ రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు.

# రాజ్యాంగాన్ని గౌరవించాలి..

**మొదటిపేజీ తరువాయి...** సూచించారు. లోక్‌సభలో మొదటిసారిగా ఆలపించిన వందేమాతరం గీతానికి సముచిత గౌరవం ఇవ్వాలని కోరారు. 'వికసిత్ భారత్ – 2047' లక్ష్య దిశగా దేశం వేగంగా పయనిస్తోందని, ప్రపంచవ్యాప్తంగా క్లిష్ట పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్ బలమైన ఆర్థిక వ్యవస్థగా నిలబడటం గర్వకారణమని చెప్పారు. దేశంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్రపతి ఈ సందర్భంగా ప్రస్తావించారు: జన్ ధన్ యోజన: జన్ ధన్ పథకం ద్వారా దేశవ్యాప్తంగా సుమారు 59 కోట్ల మందికి బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఆహార భద్రత & వైద్యం: ఉచిత రేషన్ పథకం ద్వారా 80 కోట్ల మందికి లబ్ధి చేకూరుతోందని, ఆయుష్మాన్ భారత్ ద్వారా 60 కోట్ల మందికి నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. రైతు సంక్షేమం: పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలు విశేషంగా బలోపేతమయ్యాయని వివరించారు.

ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ మౌలిక సదుపాయాలను భారత్ ఏర్పాటు చేసుకుందని రాష్ట్రపతి హర్షం వ్యక్తం చేశారు. నేడు చిన్న చిన్న గ్రామాలు, కుగ్రామాల్లో సైతం డిజిటల్ చెల్లింపులు సర్వసాధారణమయ్యాయని, ప్రపంచంలోనే అత్యధిక డిజిటల్ లావాదేవీలు జరుగుతున్న దేశంగా భారత్ నిలిచిందని కొనియాడారు. సంక్షేమాన్ని, అభివృద్ధిని సమన్వయం చేసుకుంటూ భవిష్యత్ వైపు అడుగులు వేయాలని పౌరులకు పిలుపునిచ్చారు.

# భారత్ సహనాన్ని బలహీనతగా భావించవద్దు

**మొదటిపేజీ తరువాయి...** శిబిరాలను పూర్తిగా మట్టుబెట్టడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఉగ్రవాద చర్యలను భారత్ ఎంతమాత్రం సహించదని, తగిన రీతిలో దీటుగా స్పందిస్తుందనే స్పష్టమైన సందేశాన్ని ఈ ఆపరేషన్ ద్వారా ప్రపంచానికి చాటిచెప్పామని అన్నారు. దేశ భద్రత విషయంలో ఎంతటి ప్రమాదకరమైన నిర్ణయాన్నైనా (రిస్క్) తీసుకోవడానికి, ఎలాంటి పరిణామాలనైనా ఎదుర్కొని శత్రుస్థావరాలపై దాడి చేయడానికి భారత్ వెనుకాడదని ఆయన తేల్చిచెప్పారు. ఈ డాక్యుమెంటరీలో అజిత్ దోవల్‌తో పాటు ఆపరేషన్‌లో కీలక పాత్ర పోషించిన పలువురు ఉన్నతాధికారులు కూడా తమ అనుభవాలను వెల్లడించారు. శనివారం రాత్రి 9 గంటలకు డిస్కవరీ ఛానల్‌తో పాటు దాని ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో ఈ ప్రత్యేక డాక్యుమెంటరీ ప్రసారం కానుంది. కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన పిరికిపంద ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ గతేడాది మే 7న 'ఆపరేషన్ సింధూర్'ను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ దాడిలో సరిహద్దుల్లోని పలు కీలక ఉగ్రవాద స్థావరాలు ధ్వంసమయ్యాయి. ఆ తర్వాత దాదాపు 88 గంటల పాటు ఇరు దేశాల నడుమ తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొనగా, మే 10న పాకిస్థాన్ ప్రతిపాదించిన కాల్పుల విరమణ (సీజ్‌ఫైర్) అభ్యర్థనకు భారత్ అంగీకరించింది.

# బిజెపి ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

**నారాయణపేట :** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో భాజపా ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, భాజపా రాష్ట్ర నాయకులు నాగురావు నామాజీ, రతంగపాండు రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్, పుర ఛైర్ పర్సన్ శ్వేత జాతీయ జెండాలు పట్టుకుని విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగుతూ పాతబస్టాండ్ మీదుగా సత్యనారాయణ చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాలు చిరస్మరణీయమన్నారు. ప్రతి ఒక్కరూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని, ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలన్నారు.

# ఖర్గేకు అవమానంపై కాంగ్రెస్ నిరసనలు

**ఆదిలాబాద్, ఆగస్టు14** ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను భాజపా నాయకులు అవమానించారని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలో పలు వీధుల మీదుగా పాదయాత్ర చేపట్టారు. అంబేద్కర్ కూడలి ఎదుట నోటికి నల్లగుడ్డలు పెట్టుకుని సత్యాగ్రహ దీక్ష చేశారు. భాజపాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ మాట్లాడుతూ.. మల్లికార్జున ఖర్గే రాంలీల మైదానంలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రసంగించిన తరువాత భాజపా నాయకులు ఆ వేదికను శుద్ధి చేయడం అంటరానితనం, అవమానకరం అని ఖండించారు. దీక్షలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# 'జనగణన-2027'పై కేంద్ర హోంశాఖ కీలక నోటిఫికేషన్

**మొదటిపేజీ తరువాయి...** చేసింది. ఈ ప్రశ్నావళిలో 10వ ప్రశ్నగా ఎస్సీ, ఎస్టీలతో పాటు కులానికి సంబంధించిన స్పష్టమైన వివరాలను నమోదు చేసేందుకు ప్రత్యేక విభాగాన్ని కేటాయించారు. ఈసారి జనగణనలో సాంకేతికతకు పెద్దపీట వేస్తూ, దేశంలోనే మొదటిసారిగా అత్యాధునిక యాప్‌లు, డిజిటల్ సాధనాల ద్వారా వివరాలను సేకరించనున్నారు. ప్రజలు స్వయంగా తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు 15 రోజుల పాటు ప్రత్యేక వెసులుబాటు కల్పించనున్నారు.

మొత్తం రూ. 11,718.24 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ 'జనగణన-2027'ను రెండు ప్రధాన దశల్లో పూర్తి చేయాలని భావిస్తున్నారు:

తొలి దశ (ఏప్రిల్ – సెప్టెంబర్ 2026): గృహాల లెక్కింపు, నివాస వసతులు మరియు సంబంధిత వివరాల సేకరణ జరుగుతుంది.

రెండో దశ (ఫిబ్రవరి 2027): జనాభా సంఖ్య, విద్యా అర్హతలు, ఉపాధి రకం మరియు కుల వివరాల నమోదు ప్రక్రియను నిర్వహిస్తారు.

జనగణన సమయంలో పౌరులు అందించే వ్యక్తిగత వివరాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ పూర్తి చట్టపరమైన రక్షణ కల్పించింది. 'సెన్సస్ యాక్ట్, 1948' లోని సెక్షన్ 15 ప్రకారం పౌరుల సమాచారం అత్యంత రహస్యంగా ఉంచబడుతుందని, దీనికి చట్టబద్ధమైన భద్రత ఉంటుందని స్పష్టం చేసింది.

# విద్యార్థులకు నిరసన తెలిపే హక్కు ఉంది

**మొదటిపేజీ తరువాయి...**వృత్తి చేపటే హక్కును కాలరాసేలా బెదిరించడం సరికాదని వ్యాఖ్యానించారు. బీసీఐ తీసుకున్న చర్యలపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ తీవ్రంగా స్పందించారు. "ఇదంతా పూర్తిగా అనవసరమైన ప్రక్రియ. నేను విద్యార్థిగా ఉన్న రోజుల్లో నిరసనల్లో చురుగ్గా పాల్గొనేవాడిని. ఇది నాకు, విద్యార్థులకు మధ్య జరిగిన విషయం. ఇందులో జోక్యం చేసుకోవడానికి బీసీఐ ఎవరు?" అని ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీఐ జారీ చేసిన సర్క్యులర్లపై వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించడమే కాకుండా, నల్సార్ విద్యార్థులు మరియు అధ్యాపకులపై ఎటువంటి చర్యలు తీసుకోకూడదని ఆదేశించింది. సుప్రీంకోర్టు కఠిన వైఖరితో బీసీఐ ఇప్పటికే తన వివాదాస్పద ఉత్తర్వులను ఉపసంహరించుకుంది.

## రామగుండంలో వందేమాతరం ర్యాలీ

**రామగుండం :** పెద్దపల్లి జిల్లా రామగుండం లయన్స్ క్లబ్ ఆఫ్– మగువ, ట్రూ ఫిట్ జిమ్ ఆధ్వర్యంలో వందేమాతరం ర్యాలీ నిర్వహించారు. ఎన్టీపీసీ ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డు నుంచి అధికారులు, యువత, విద్యార్థులు త్రివర్ణ పతాకాలతో యూనివర్సిటీ పీజీ కాలేజ్ వరకు 2కె రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీజీ కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సామూహిక వందేమాతరం గీతాన్ని ఆలపించారు. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఫిట్ ఇండియా నినాదంతో యువత దేశ సమగ్రతను కాపాడాలని లయన్స్ క్లబ్ మగువ అధ్యక్షురాలు అంబటి అర్చన రావు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు నిత్యం వ్యాయామం చేసి ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. మనం ఫిట్ గా ఉండడం వల్ల దేశం ఫిట్ గా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో గోదావరిఖని వన్ టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ట్రాఫిక్ సీఐ సంతోష్ రావు, జిమ్ ట్రైనర్ షకీల్, వాకర్స్, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆదిలాబాద్‌లో ఆకట్టుకున్న హర్ ఘర్ తిరంగా

**ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం ఎన్‌సీసీ 32 పటాలం ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఖుర్షీద్ నగర్, సుందరయ్య నగర్, మహాలక్ష్మి వాడ కాలనీల్లో క్యాడెట్లు జాతీయ జెండాలు పట్టుకొని ర్యాలీలో పాల్గొన్నారు. భారతదేశ స్వాతంత్య్ర పోరాటంలో భాగస్వాములైన సమరయోధులను గుర్తు చేసుకుంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ ఉన్నతాధికారులు, మాజీ సైనికులు, ఉమ్మడి జిల్లాకు చెందిన 562 మంది క్యాడెట్లు పాల్గొన్నారు.

భాజపా ఆధ్వర్యంలో శుక్రవారం గుడిహత్నూర్ మండల కేంద్రంలో దేశభక్తిని చాటేలా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలను చేత పట్టుకుని స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో భాజపా జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం, నాయకులు, కార్యకర్తలు, యువత, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుల్లో రాణించాలి: ఎమ్మెల్యే

**నల్లగొండ,** విద్యార్థులు చదువుల్లో రాణించి మంచి భవిష్యత్‌ను నిర్మించుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం కోరారు. నకిరేకల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత ఏకరూప దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, ఉచిత పుస్తకాలు, యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం వంటి పథకాల ద్వారా విద్యను అందరికీ చేరువ చేస్తున్నామన్నారు. మండల విద్యాశాఖ అధికారి ఎం. నాగయ్య, పాఠశాల హెచ్‌ఎం కె .రాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# చందూర్ మండల అభివృద్ధికి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి బాట..

- ఆదర్శంగా నిలిచేలా పనులకు శ్రీకారం
- మేడిపల్లి తండా, లక్ష్మీసాగర్ తండాల్లో రూ.1.95 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం





బాన్సువాడ నియోజకవర్గం,) ఆగస్టు 14:/జన సంఘర్షణ)

ప్రజల అవసరాలను గుర్తించి గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆదర్శంగా నిలుస్తున్నారని స్థానిక నాయకులు, గ్రామస్థులు పేర్కొన్నారు. చందూర్ మండలంలోని మేడిపల్లి తండా, లక్ష్మీసాగర్ తండాల్లో శుక్రవారం ఆయన పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.

**మేడిపల్లిలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన**

గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మేడిపల్లి నుంచి లక్ష్మీసాగర్ వరకు ఎస్‌డీఎఫ్ నిధులతో రూ.కోటి వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అదేవిధంగా లక్ష్మీసాగర్ నుంచి వ్యవసాయ పంట పొలాలకు వెళ్లే మార్గంలో రూ.70 లక్షల.... ఎస్‌డీఎఫ్ నిధులతో నిర్మించిన మెటల్ రోడ్డు, లో లెవెల్ వంతెనను ప్రారంభించారు. దీంతో గ్రామస్తులు, రైతుల రాకపోకలకు ఇబ్బందులు తొలగి, పంట పొలాలకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడనుంది. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...... గ్రామాల అభివృద్ధికి రహదారులు, వంతెనలు, పంచాయతీ భవనాలు వంటి మౌలిక వసతులు ఎంతో కీలకమన్నారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి దశలవారీగా పూర్తి చేస్తామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి నిధులు కేటాయించి పనులను పూర్తి చేయించడం ద్వారా పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రజాప్రతినిధిగా ఆదర్శంగా నిలుస్తున్నారని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు. అభివృద్ధి పనులు అందుబాటులోకి రావడంతో మేడిపల్లి తండా, లక్ష్మీసాగర్ తండా ప్రజలు, రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో , ఏఎంసి, సురేష్ బాబా, భారీ భాయ్, సాయి రెడ్డి, చందూర్ మండల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామ పెద్దలు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# బెదిరింపులతో డబ్బుల వసూళ్లు.. ఆత్మహత్యకు ప్రేరేపణ కేసులో ఇద్దరి అరెస్ట్

- ఆర్టీఐ ద్వారా ఉద్యోగ వివరాల సేకరణ.. ఉద్యోగం పోతుందంటూ బెదిరింపులు
- ప్రెస్ రిపోర్టర్లుగా పరిచయం చేసుకొని పలువురి నుంచి డబ్బుల డిమాండ్
- కామారెడ్డి డీస్పీ మధుసూదన్ వివరాలు

కామారెడ్డి బ్యూరో:/ఆగస్టు 14/జన సంఘర్షణ)

కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైం నం.693/2024లో చేపూరి శిరీష ఆత్మహత్య కేసు దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు కామారెడ్డి డీస్పీ మధుసూదన్ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని బెదిరింపులకు పాల్పడుతూ డబ్బులు వసూలు చేసినట్లు దర్యాప్తులో ఆధారాలు లభించాయని వెల్లడించారు. మృతురాలి ప్రభుత్వ ఉద్యోగం, జీతం, సర్వీస్ తదితర వివరాలను ఆర్టీఐ ద్వారా సేకరించి, ఉద్యోగం కోల్పోయేలా చేస్తామని బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ వేధింపుల నేపథ్యంలో కేసును ఆత్మహత్యకు ప్రేరేపణ కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో ఏ2 ఇందూరి సిద్దా గౌడ్, ఏ3 లాండే భాస్కర్‌లను ఈ నెల 13న కామారెడ్డి ప్రాంతంలో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో నేరానికి సంబంధించిన కీలక విషయాలను వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఇద్దరినీ కామారెడ్డి న్యాయస్థానంలో హాజరుపరిచారు.

**ప్రెస్ రిపోర్టర్లుగా పరిచయం చేసుకొని..**

దర్యాప్తులో నిందితులు తమను ప్రెస్ రిపోర్టర్లుగా పరిచయం చేసుకుని పలువురిని లక్ష్యంగా చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. తమపై ప్రతికూల వార్తలు ప్రచురిస్తామని, అధికారులకు ఫిర్యాదులు చేస్తామని, ఉద్యోగాలు పోయేలా చేస్తామని బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆధారాలు లభించాయని తెలిపారు.

ఇలాంటి బెదిరింపులు, డబ్బుల వసూళ్లకు సంబంధించి కామారెడ్డి, యల్లారెడ్డి, దోమకొండ, గాంధారి, దేవునిపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో గతంలోనూ పలు కేసులు నమోదైనట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు పోలీసులు పేర్కొన్నారు.

**బ్లాక్‌మెయిల్‌పై పోలీసుల నజర్....**

ఇటీవల గాంధారి ప్రాంతానికి చెందిన ఓ ఫారెస్ట్ అధికారిని ఇద్దరు వ్యక్తులు వీడియో తీసి బ్లాక్‌మెయిల్ చేసిన ఘటనపై కూడా ఫిర్యాదు నమోదైనట్లు సమాచారం. అధికారిని బెదిరించినట్లు విచారణలో తేలడంతో వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిసింది.

**నకిలీ విలేకరులపై నిఘా?...**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కొందరు వ్యక్తులు విలేకరుల ముసుగులో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు చాలాకాలంగా వినిపిస్తున్నాయి. కొందరు నకిలీ ఐడీ కార్డులు, అక్రిడిటేషన్ కార్డులతో విలేకరులుగా చలామణి అవుతున్నారనే ఫిర్యాదులపైనా అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం. ప్రధాన రహదారుల వెంట రాత్రివేళల్లో వాహనాలను ఆపి, ఇసుక, ధాన్యం తదితర సరుకుల రవాణాను అడ్డుకుని డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇటీవల బాన్సువాడ మీదుగా వెళ్తున్న ఓ ధాన్యం లారీని కొందరు వ్యక్తులు అడ్డుకుని డబ్బులు డిమాండ్ చేసిన ఘటనలో సమాచారం అందడంతో పోలీసులు రంగంలోకి దిగి లారీని



పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. అలాగే కొందరు ఇసుక, మరికొందరు మోరం రవాణా వ్యవహారాల్లో జోక్యం చేసుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే వీటిలో ప్రతి అంశాన్ని పోలీసులు అధికారికంగా నిర్ధారించాల్సి ఉంది.

**అర్హత ఉన్న విలేకరుల గుర్తింపునకు చర్యలు?...**

విలేకరుల పేరుతో అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిజమైన జర్నలిస్టులు, ప్రజలు కోరుతున్నారు. జిల్లాలో అర్హత కలిగిన విలేకరులు ఎంతమంది, అర్హత లేకుండా విలేకరులుగా చలామణి అవుతున్న వారు ఎంతమంది అనే అంశంపై ఐడీ కార్డులు, అక్రిడిటేషన్ వివరాలను పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ప్రెస్ గుర్తింపును అడ్డుపెట్టుకుని బెదిరింపులు, బ్లాక్‌మెయిల్, అక్రమ వసూళ్లకు పాల్పడే వ్యక్తులపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తే నిజమైన జర్నలిస్టులకు గౌరవం మరింత పెరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. తాజా ఆత్మహత్యకు ప్రేరేపణ కేసు నేపథ్యంలో ఇలాంటి వ్యవహారాలపై పోలీసుల దర్యాప్తు మరింత విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

- బిచ్కుంద ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు ఆకస్మిక తనిఖీ



బిచ్కుంద, /ఆగస్టు 14: /జన సంఘర్షణ)

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం వైద్య సిబ్బంది బాధ్యతని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు హెచ్చరించారు. జుక్కల్ నియోజకవర్గంలోని బిచ్కుంద మండల కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు, విధుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బంది సమయపాలనపై ప్రత్యేకంగా దృష్టి సారించిన ఎమ్మెల్యే.. సమయానికి విధులకు హాజరుకాని సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. హాజరు పట్టికను స్వయంగా పరిశీలించి, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కామారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సేవలు నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఇకపై ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది సమయపాలనతో పాటు ప్రజలకు అందుతున్న వైద్య సేవల నాణ్యతపై మరింత కఠినంగా పర్యవేక్షణ కొనసాగిస్తామని తోట లక్ష్మీకాంతరావు స్పష్టం చేశారు.

# అంబం ప్రభుత్వ పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

- విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు.. సీజనల్ వ్యాధులపై అవగాహన



అంబం/ఆగస్టు 14/జన సంఘర్షణ)

అంబం: విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ఆధ్వర్యంలో అంబం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత, చేతులు శుభ్రంగా ఉంచుకోవడం, పౌష్టికాహారం తీసుకోవడం వంటి అంశాలపై వైద్యులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ కూర్లేపు గంగాధర్, ఉపసర్పంచ్ రేపల్లె సాయి ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. "పిల్లలే దేశ భవిష్యత్తు. పాఠశాల దశ నుంచే వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపడం అభినందనీయం. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి" అని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన వైద్య సేవలు అందించిన ఆర్‌బీఎస్‌కే వైద్య బృందంతో పాటు పాఠశాల సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే వైద్యుడు డాక్టర్ అరవింద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మనోజ్, గ్రామ పంచాయతీ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాద బాధితుని కుటుంబాన్ని పరామర్శించే ఆర్థిక సహాయం అందజేత

- కాంగ్రెస్ పార్టీ నాయకుడు, లీలా గ్రూప్ చైర్మన్ మీనాక్షి డాక్టర్ మోహన్ నాయక్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 14 (జన సంఘర్షణ)



మెదక్ జిల్లా నిజాంపేట మండలం జెట్ చెరువు తండాకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ ప్రకాష్ ఇటీవల రోడ్ ఆక్సిడెంట్‌లో గాయపడి హాస్పిటల్లో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నారు ఇట్టి సమాచారాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకుడు,లీలా గ్రూప్ చైర్మన్ మీనాక్షి డాక్టర్ మోహన్ నాయక్ గారికి తెలియజేయగా వారి ఊరికి చేరుకొని కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి యాక్సిడెంట్‌కు గల కారణాలను అడిగి తెలుసుకుని పలు హాస్పిటల్ రిపోర్ట్స్‌ను పరీక్షించి తగు సలహాలు సూచనలు చేసి 5,000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాబు,రాజు,గోపాల్,లాలూ తేజ, బాలకృష్ణ, సక్రి,సరోజ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు,గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవం జెండా ఆవిష్కరణ కార్యక్రమం

- వి ఆర్ ఎస్ పట్టణ నాయకులకు నమస్కారం.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 14 (జన సంఘర్షణ)

నేడు ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉదయం 10:00 గంటలకు జిల్లా పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి మాజీ ఉపసభాపతి పద్మాదేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ షేర్ సుభాష్ రెడ్డి, మాజీ శాసనసభ్యుడు పట్లోళ్ల శశిధర్ రెడ్డి, బి ఆర్ ఎస్ పార్టీ నాయకుడు కంటారెడ్డి తిరుపతి రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్లు బట్టి జగపతి, మల్లికార్జున్ గౌడ్, సురేందర్ గౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొంటారు. మెదక్ పట్టణంలోని కౌన్సిలర్లు, మాజీ చైర్మన్లు, మాజీ కౌన్సిలర్లు, బూత్ స్థాయి నాయకులు, బూత్ ఏజెంట్లు, బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, మహిళా నాయకురాళ్లు, సోషల్ మీడియా విభాగం, యువజన, విద్యార్థి విభాగాల నాయకులు అందరూ విధిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరనీ మెదక్ పట్టణ బిఆర్ఎస్ నాయకులు కోరారు.

# స్వాతంత్ర్య వేడుకలకు పటిష్ట భద్రత

- మెదక్‌లో బాంబ్, డాగ్ స్క్వాడ్‌లతో విస్తృత తనిఖీలు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 14 (జన సంఘర్షణ)







స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో మెదక్ జిల్లా పోలీసులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు శుక్రవారం మెదక్ పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో బాంబ్,డాగ్ స్క్వాడ్‌లతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మెదక్ బస్టాండ్,రైల్వే స్టేషన్, సినిమా థియేటర్లు, కలెక్టరేట్, కోర్టు ప్రాంగణంతో పాటు ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. బాంబ్ స్క్వాడ్ సిబ్బంది ప్రత్యేక పరికరాలతో అనుమానాస్పద వస్తువులు, బ్యాగులు, పరిసరాలను తనిఖీ చేశారు. డాగ్ స్క్వాడ్ సిబ్బంది శిక్షణ పొందిన స్నిఫర్ డాగ్ సహాయంతో అనుమానాస్పద ప్రదేశాలను పరిశీలించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టిందని అధికారులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వస్తువులు లేదా వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. తనిఖీల్లో ఎస్సై విట్టల్,హెడ్ కానిస్టేబుళ్లు ఫస్సియొద్దీన్, రవీందర్, కానిస్టేబుళ్లు నర్సింలు, దుర్గ ప్రసాద్, రాజేష్ పాల్గొన్నారు.

# ఎర్రపహాడ్‌లో ఘనంగా కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కామారెడ్డి జిల్లా ఆగస్టు 14 (జన సంఘర్షణ)




తెలంగాణ ప్రభుత్వం పేద కుటుంబాల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. తాడ్వాయి మండలం ఎర్రపహాడ్ గ్రామంలో శుక్రవారం ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు మార్గదర్శకంలో లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన 7 మంది లబ్ధిదారులకు ప్రతిపాదనల ప్రకారం కళ్యాణలక్ష్మి చెక్కులను ప్రజాప్రతినిధులు, నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ఆడపిల్లల పెళ్లిళ్లు పేద కుటుంబాలకు భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకం ద్వారా కొండంత అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా ఎమ్మెల్యే నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సొంటికే మల్లవ్వ, కాంగ్రెస్ పార్టీ మండల/గ్రామ నాయకులు ఆరాలి కిషన్ రావు, ప్రభాకర్ రెడ్డి, మోహన్ రెడ్డి, జెలేందర్ రెడ్డి, టి. మోహన్ రెడ్డి, మోహన్ గౌడ్, బీరయ్య, సిహెచ్. సాయిలు, సంజీవరెడ్డి, తిరుపతి రెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గైని రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

# పోతంగల్‌లో డాక్టర్ ఎంఏ హకీమ్‌కు బీఆర్ఎస్ నాయకుల మర్యాదపూర్వక కలయిక

పోతంగల్, /ఆగస్టు 14/జన సంఘర్షణ):




పోతంగల్ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సమాజ సేవకులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు డాక్టర్ ఎంఏ హకీమ్‌ను మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎంఏ హకీమ్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం మండలంలోని పార్టీ పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, సామాజిక సేవా కార్యక్రమాలపై నాయకులు చర్చించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డాక్టర్ ఎంఏ హకీమ్ సేవలను నాయకులు కొనియాడారు. రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు, రహీం భాయ్, వజిత్,హబిద్, జాకోర, డాక్టర్, అప్రోచ్, ఇమ్రాన్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జన సంఘర్షణ

శనివారం
15 ఆగస్టు 2026

# సూపర్ స్టార్ ఆఫీసర్లకు ఏమైంది?

**❑ ఏపీలో ఆమ్రపాలి.. తెలంగాణలో స్మితా సబర్వాల్!**

హైదరాబాద్ బ్యూరో/ఆగస్టు 14/జన సంఘర్షణ)

తెలుగు రాష్ట్రాల పరిపాలనా యంత్రాంగంలో ఒకప్పుడు తమదైన ముద్ర వేసుకున్న ఇద్దరు ఐఏఎస్ అధికారులు ఇప్పుడు వార్తల్లో కనిపించకపోవడం చర్చనీయాంశంగా మారింది. డైనమిజం, వేగవంతమైన నిర్ణయాలు, ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు, కీలక బాధ్యతల్లో చురుకైన పనితీరుతో ఒకప్పుడు 'సూపర్ స్టార్' అధికారులుగా పేరు తెచ్చుకున్న కాట ఆమ్రపాలి, స్మితా సబర్వాల్ ప్రస్తుతం లూప్‌లైన్‌లోకి వెళ్లిపోయారనే చర్చ అధికార వర్గాల్లో సాగుతోంది.ఒకరు ఏపీ క్యాడర్‌లో...... మరొకరు తెలంగాణలో....... గతంలో కీలక స్థానాల్లో వెలుగొందిన ఈ ఇద్దరు అధికారుల కెరీర్ గ్రాఫ్‌లో వచ్చిన మార్పులు ఆసక్తికరంగా మారాయి. రాజకీయ మార్పులు, పరిపాలనా ప్రాధాన్యతల్లో వచ్చిన మార్పులు, పోస్టింగుల పరిణామాలు వీరి పరిస్థితిపై ప్రభావం చూపాయా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

**ఆమ్రపాలి.. న్యాయపోరాటం తర్వాత కూడా పోస్టింగ్‌పై నిరాశేనా?**

వరంగల్ కలెక్టర్‌గా, హైదరాబాద్ జీహెచ్ఎంసీలో, ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వ పరిపాలనా విభాగంలో తనదైన శైలితో పనిచేసిన ఆమ్రపాలి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. రాష్ట్ర విభజన అనంతరం క్యాడర్ కేటాయింపుల్లో ఆమెకు ఏపీ క్యాడర్ దక్కింది. అయితే తెలంగాణలోనే పనిచేయాలన్న ఆకాంక్షతో క్యాట్, హైకోర్టును ఆశ్రయిస్తూ ఆమె సుదీర్ఘ న్యాయపోరాటం చేశారు. చివరకు క్యాడర్ కేటాయింపు వ్యవహారంలో కేంద్ర నిర్ణయానికి అనుగుణంగా ఏపీకి వెళ్లాల్సి వచ్చింది. ఏపీలో బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆశించిన స్థాయిలో కీలక బాధ్యతలు దక్కకపోవడం, వరుసగా సెలవుల్లో ఉండటం, అనంతరం సాధారణ బదిలీ చోటుచేసుకోవడం వంటి పరిణామాలు ఆమె విషయంలో చర్చకు దారితీశాయి. సమర్థత ఉన్న అధికారిగా పేరున్నప్పటికీ, అనుకూల పరిపాలనా



సమీకరణాలు లేకపోవడం ఆమె కెరీర్‌పై ప్రభావం చూపిందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

**స్మితా సబర్వాల్‌కు మారిన రాజకీయ పరిస్థితుల ప్రభావమా?**

తెలంగాణ బ్యూరోక్రసీలో అత్యంత గుర్తింపు పొందిన అధికారుల్లో స్మితా సబర్వాల్ ఒకరు. గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కార్యాలయం, మిషన్ భగీరథ వంటి కీలక విభాగాల్లో ఆమె కీలక పాత్ర పోషించారు. వేగవంతమైన నిర్ణయాలు, సమర్థవంతమైన పర్యవేక్షణతో ప్రజల్లోనూ ప్రత్యేక గుర్తింపు పొందారు. అయితే తెలంగాణలో ప్రభుత్వం మారిన తర్వాత ఆమె పరిస్థితుల్లోనూ మార్పు కనిపించింది. కొత్త ప్రభుత్వ పరిపాలనా ప్రాధాన్యతలకు అనుగుణంగా కీలక బాధ్యతలు దక్కకపోవడం, సోషల్ మీడియా వేదికలపై ఆమె చేసిన కొన్ని వ్యాఖ్యలపై రాజకీయ వర్గాల్లో చర్చ జరగడం వంటి అంశాలు కూడా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ప్రాధాన్యత లేని పోస్టింగుల కంటే సెలవుల్లో ఉండటానికే ఆమె మొగ్గు చూపుతున్నారనే ప్రచారం కూడా అధికార వర్గాల్లో సాగుతోంది. అయితే అధికారుల పోస్టింగులు, సెలవులు వంటి అంశాలపై అధికారికంగా వెల్లడైన వివరాలనే తుది ఆధారంగా పరిగణించాల్సి ఉంటుంది.

**'సూపర్ స్టార్' నుంచి సైడ్‌లైన్‌కు.. కారణమేంటి?**

ప్రభుత్వాలు మారినప్పుడు.... పరిపాలనా ప్రాధాన్యతలు మారడం సహజమే. దానికి అనుగుణంగా అధికారుల పోస్టింగుల్లోనూ మార్పులు చోటుచేసుకుంటాయి. అయితే ఒకప్పుడు కీలక స్థానాల్లో చక్రం తిప్పిన అధికారులే ప్రస్తుతం పెద్దగా కనిపించకపోవడం మాత్రం ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. రాజకీయ సమీకరణాలు, పరిపాలనా విధానాల్లో మార్పులు, అధికారుల వ్యక్తిగత పని శైలి..... ఇలా అనేక అంశాలు పోస్టింగులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అయితే ఈ ఇద్దరు అధికారుల విషయంలో అసలు కారణం ఇదేనని నిర్ధారించడానికి మరింత అధికారిక సమాచారం అవసరం. ఏది ఏమైనా.. ఆమ్రపాలి, స్మితా సబర్వాల్ వంటి అధికారులు ఒకప్పుడు పరిపాలనలో తమదైన ముద్ర....వేసిన వారే. ప్రస్తుతం కీలక బాధ్యతలకు దూరంగా ఉండటం మాత్రం బ్యూరోక్రసీ వర్గాల్లో ఆసక్తికర చర్చగా మారింది. భవిష్యత్తులో వీరికి ఎలాంటి పోస్టింగులు దక్కుతాయి? మళ్లీ కీలక బాధ్యతల్లోకి వస్తారా? అన్నది వేచి చూడాల్సిందే.

# కామారెడ్డిలో ఘనంగా రాజీవ్ జ్యోతి సద్భావనా యాత్ర

**❑ ఏలే మల్లికార్జున్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం**
**❑ జాతీయ సమైక్యత, మత సామరస్యం, సద్భావన సందేశంతో ముందుకు సాగిన 35వ రాజీవ్ జ్యోతి యాత్ర**

కామారెడ్డి బ్యూరో:/ఆగస్టు 14/జన సంఘర్షణ

దేశ ఐక్యత, మత సామరస్యం, జాతీయ సమగ్రతను చాటుతూ కొనసాగుతున్న 35వ రాజీవ్ జ్యోతి సద్భావనా యాత్రకు కామారెడ్డి పట్టణంలో ఘన స్వాగతం లభించింది. కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు యాత్రకు ఘన స్వాగతం పలికారు. అనంతరం రాజీవ్ జ్యోతితో యాత్రను ముందుకు కొనసాగించారు. 2026 ఆగస్టు 9న శ్రీపెరంబుదూర్ నుంచి ప్రారంభమైన ఈ యాత్ర తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, హర్యానా రాష్ట్రాల మీదుగా సాగుతూ ఆగస్టు 20న న్యూఢిల్లీలో ముగియనుంది. మాజీ ప్రధాని, దివంగత రాజీవ్ గాంధీ దేశ నిర్మాణానికి చేసిన సేవలను స్మరించుకోవడంతో పాటు, జాతీయ సమైక్యత, మత సామరస్యం, దేశ సమగ్రత కోసం ఆయన కన్న కలలను ప్రజల్లోకి తీసుకెళ్లడం యాత్ర ప్రధాన ఉద్దేశ్యమని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కామారెడ్డిలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, కామారెడ్డి టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఐరేని సందీప్ కుమార్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు "ఐక్యతే బలం.. సద్భావనే దేశ ప్రగతికి







పునాది" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. జాతీయ సమైక్యత, సామాజిక సామరస్యం, సోదరభావాన్ని పెంపొందించడమే లక్ష్యంగా రాజీవ్ జ్యోతి సద్భావనా యాత్ర ముందుకు సాగింది.

# కోటగిరిలో జాతీయ జెండా ఆవిష్కరణకు ఆహ్వానం

**❑ అంబేడ్కర్ విగ్రహం సమీపంలో జెండా ఎగురవేయనున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు షాహిద్ హుస్సేన్..**

కోటగిరి/, ఆగస్టు 14: /జన సంఘర్షణ)




స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 15న కోటగిరి మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం సమీపంలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కోటగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షాహిద్ హుస్సేన్ తెలిపారు. శనివారం ఉదయం 8 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో షాహిద్ హుస్సేన్ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటేలా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు కాంగ్రెస్ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి కోటగిరి మండల మాజీ జడ్పీటీసీలు, సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, రాజకీయ నాయకులు, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని షాహిద్ హుస్సేన్ విజ్ఞప్తి చేశారు.

# జిల్లాలో సమృద్ధిగా యూరియా నిల్వలు

**❑ జిల్లాలో మొత్తం 2403 మెట్రిక్ టన్నుల యూరియా.**
**❑ జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 14(జన సంఘర్షణ)



జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్ శుక్రవారం ప్రకటన విడుదల చేస్తూ జిల్లాలో మొత్తం 2,403 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ అందుబాటులో ఉంది. ఇందులో మార్క్‌ఫెడ్ వద్ద 1,855 మెట్రిక్ టన్నులు మరియు రిటైలర్ల వద్ద 548 మెట్రిక్ టన్నులు ఉన్నాయి. .07.08.2026 నుండి రైతులు ఎఫ్ఎస్ఎస్ యాప్ ద్వారా యూరియాను కొనుగోలు చేస్తున్నారు. అని తెలిపారు. రైతులు ఎఫ్ ఎస్ ఎస్ యాప్ ద్వారా వచ్చిన మొత్తం యూరియా పరిమాణానికి సంబంధించి బుకింగ్ చేస్తున్నట్లు వివరించారు. ప్రతిరోజూ యూరియా స్టాక్‌ను అందుబాటులో ఉంచుతున్నాము అని తెలిపారు. రిటైలర్ కేంద్రాల వద్ద ఉన్న వాలంటీర్లు, రైతు వేదికల వద్ద ఉన్న ఏ ఈ ఓ లు రైతులకు ఎఫ్ ఎస్ ఎస్ యాప్ ద్వారా యూరియా బుకింగ్ చేసే విధానంపై అవగాహన కల్పిస్తున్నారు.అని తెలిపారు.ఎఫ్ ఎస్ ఎస్ యాప్‌ను వినియోగించడంలో ఇబ్బంది పడుతున్న రైతులకు బుకింగ్ చేయడంలో సహాయం అందిస్తూ,వారి సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు.

# అంబం ప్రభుత్వ పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**❑ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు.. సీజనల్ వ్యాధులపై అవగాహన**

అంబం/ఆగస్టు 14/జన సంఘర్షణ)



అంబం: విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ఆధ్వర్యంలో అంబం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత, చేతులు శుభ్రంగా ఉంచుకోవడం, పౌష్టికాహారం తీసుకోవడం వంటి అంశాలపై వైద్యులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ కూర్లేపు గంగాధర్, ఉపసర్పంచ్ రేపల్లె సాయి ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. "పిల్లలే దేశ భవిష్యత్తు. పాఠశాల దశ నుంచే వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపడం అభినందనీయం. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి" అని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన వైద్య సేవలు అందించిన ఆర్‌బీఎస్‌కే వైద్య బృందంతో పాటు పాఠశాల సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే వైద్యుడు డాక్టర్ అరవింద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మనోజ్, గ్రామ పంచాయతీ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మద్నూర్‌లో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ

**❑ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సభ్యులకు ఆహ్వానం**

మద్నూర్/, ఆగస్టు 14:/జన సంఘర్షణ)




స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మద్నూర్‌లోని మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 15న జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. శనివారం ఉదయం 9 గంటలకు మున్నూరు కాపు సంఘం కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు, కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. దేశభక్తి స్ఫూర్తిని చాటుతూ నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్నూరు కాపు సోషల్ మీడియా, మద్నూర్ మండల్ ప్రతినిధులు కోరారు.




స్థలం: మున్నూరు కాపు సంఘం, మద్నూర్
సమయం: ఉదయం 9:00 గంటలకు
తేదీ: 15-08-2026
ఇట్లు:
మీ బండి వారి హన్మాండ్లు
మున్నూరు కాపు సోషల్ మీడియా, మద్నూర్ మండల్ నాయకులు పేర్కొన్నారు.

# 100 మీటర్ల జాతీయ జెండాతో ఘనంగా హర్ ఘర్ తిరంగా యాత్ర

**❑ దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటుతూ బోధన్‌లో బీజేపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ**

నిజామాబాద్ బ్యూరో/ఆగస్టు 14/జన సంఘర్షణ)





భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బోధన్ పట్టణంలో భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో 100 మీటర్ల భారీ జాతీయ జెండాతో ఘనంగా తిరంగా యాత్ర నిర్వహించారు. దేశభక్తి, జాతీయ సమైక్యత, దేశ ఐక్యతను చాటేలా సాగిన ఈ ర్యాలీలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చేతుల్లో జాతీయ జెండాలను పట్టుకుని దేశభక్తి నినాదాలతో ర్యాలీలో ఉత్సాహంగా ముందుకు సాగారు. భారీ 100 మీటర్ల జాతీయ జెండా యాత్రకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి త్రివర్ణ పతాకానికి గౌరవం చాటాలని సూచించారు. ప్రజల్లో దేశభక్తి భావనను పెంపొందించడం, జాతీయ జెండా విశిష్టతను తెలియజేయడం, జాతీయ సమైక్యతను బలోపేతం చేయడమే హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక



## మన అడుగుల కదలికలో....మార్పన్నది తప్పనిసరి!!



సభ్య సమాజంలో...రాజకీయం
రాజ్యమేలుతుంది.
రాజకీయంగా బలుపు ఉన్నవాడు
ఏమిచేసినా...చెల్లిపోతుంది.
ఎన్ని అరాచకాలు, ఎన్ని కుట్రలు పన్నినా
వారిదే పైచేయి.
తర తరాలుగా...రాజకీయ దౌర్జన్యాలు
పెట్రేగిపోతూ...
కులవ్యవస్థల పై చిన్నచూపు ఏర్పడి
కులవివక్షతకు దారి తీసింది.
రాజకీయంగా ప్రభుత్వాలను ఏలేవారు రెడ్లు, కమ్మోలేనా...
వేరెవరికీ ఆ అర్హత లేదా...కలకాలం వారి మోచేతి క్రింది
నీళ్లు త్రాగేటట్లు అనవాయించు కోవడం ఎంతవరకూ సబబూ!
జీవితకాలమూ..ఇలాగే సాగి పోద్ది అనుకుంటున్నారా...
ఇదే తీరు మీకు అలవాటు అనుకుంటే,పొరపాటు!
తిరుగుబాటు తప్పనిసరి. ప్రజాస్వామ్య వ్యవస్థలో..
కాంట్యూషన్ ఆఫ్ ఇండియా ఆర్టికల్..19.నిభందల అమలు కావడంతో...
రాజులు రాజ్యాలేలే రాచరికపు పోకడలు పోయాయి.
ప్రజాస్వామ్యానికి ప్రతిబంధకా లేర్పడ్డాయి
న్యాయం, ధర్మం, అన్నది జీవిత విధానంలో ప్రముఖ పాత్ర వహిస్తుంది.
ఈ నేపథ్యంలో...సర్వమత సౌంభ్రాంతృత్వం ! ఏకత్వంలో..భిన్నత్వం !!
భారతదేశ అభిమతం !!! ఈ రీతిలోనే, ఇప్పటివరకూ
ఏమతానికి చెందినవారమైనా సోదరభావంతో...అడుగులు వేస్తూ..
మానవతా దృక్పథంతో... అభ్యుదయ భావంతో ముందుకు పోగలుగు తున్నాం!
మతాలు వేరైనా... కులాలు వేరైనా... ప్రాంతాలు వేరైనా... మన అభిమతం ఒక్కటే అంటూ... అందరూ కలిసుండి ఎవరికి వారు స్వతంత్ర ప్రతిపత్తిని కలిగి ఉండడం అన్నది గొప్ప విసయం!ఈ విధానం ప్రపంచంలో ఉన్నటువంటి దేశాల్లో ...వేరెక్కడా...లేదన్నది నిజం! ప్రజాస్వామ్య విలువలతో ప్రణమిల్లిన దేశం మన భారత దేశం !
ప్రపంచదేశాల్లో... పేరెన్నికగన్న దేశం మన భారతదేశం !! ఇంత పేరు ప్రఖ్యాతలతో ఆసియా ఖండాని కే మకుటంలేని, భారతావని
మన దేశం భారత దేశం !!! ఇంతగా అభివృద్ధి చెందుతున్నా...కూడా మన ఆంధ్రప్రదేశ్ లో...రాజకీయంగా... నీచ, నికృష్ట, దౌర్భాగ్యాలు రాజ్యమేలుతున్నాయి అగ్రకులాల ప్రాబల్యం పేట్రేగిపోతోంది. అనాదిగా...అగ్ర కులాలు మాలా, మాదిగ, వెనుకబడిన కులాలపై అధిపత్యం పోరు ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. అన్నింటిలోనూ...మేమే అధికులమంటూ..రాజకీయ మధ, మాచ్చర్యాలతో దౌర్జన్య కాండలు జరుగుతూనే ఉన్నాయి. నిర్ధాక్షిణ్యంగా.. వూరికి దూరంగా.. అంటరానివారిగా.. అమానుషమైన కక్షపూరితమైన ఆంక్షలు విధించి వేలివేయబడ్డ కులాలెన్నో....
ఇప్పటికీ...కూటికీ, గూడుకీ, గుడ్డకూ నోచుకోని అభాగ్యులెందరో దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తున్నారు అనడంలో అతిశయోక్తి లేదు! ప్రపంచంలో.. గొప్ప నాగరిక భారతావని అని చెప్పుకోవడం కాదు ప్రజాస్వామ్య విలువలను పునరుద్ధరించాలి. అప్పుడే ప్రజాస్వామ్యానికి సార్థకత ఏర్పడుతుంది. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లలైనా.... ఇప్పటికీ ఈ దౌర్జన్యఖాండలు విరాజిల్లుతూనే ఉన్నాయి ఈ దుచ్చర్యలకు అంతం లేదా.. గాంధీ పుట్టిన దేశం అని చెప్పుకోడానికే.... ఊరు గొప్ప! పేరు దిబ్బ! అన్న సామెత గుర్తుకొస్తుంది.
అనాగరిక మైన జీవన వైవిధ్యం! సగటు మానవ జాతి దృక్పథానికి నిదర్శనం!
ఘీంకారారణ్యంలో... అరణ్యరోధనలతో...వింతైన మానవరూప సమూహాలు మనిషిని మనిషే చీల్చి చెండాడే నరరూప రాక్షసులకు భయంకర పిచాచులకు ఆవాసాలుగా... మారాయి. కలియుగంలో... కామ, క్రోధాలు, బలవంతుడు బలహీనుడ్ని చీల్చి తినేసే రోజులు ఉత్పన్నం అవుతాయి అన్నది శాస్త్రాలు చెపుతూనే ఉన్నాయి. ప్రస్తుత సమాజంలో.... డబ్బే పరమావధిగా డబ్బున్నవాడే గొప్పవాడుగాచలామణి కాగలుగు తున్నాడు. ఎంతటి మేధస్సున్నా.... ఎందుకూ కొరగాడు! ఈరోజులుల్లో.. డబ్బే ప్రధానం! మంచి,చెడు అన్న తారతమ్యం తెలిసొచ్చే రోజులు ఎప్పుడో పోయాయి. మనిషికి మనిషి పీక్కు తినే రోజులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇది కలియుగం. మనిషిని మనిషిగా చూడలేని నిరంకుశ ధోరణిలతో, సభ్యసమాజం సిగ్గుపడే విధంగా మానవత్వం మంటగలసి పోతుంది. ఎన్నో...అసాంఘీకమైన చిత్ర విచిత్రాలు కళ్ళముందే కదలాడుతుంటే...ఏమను కోవాలి...! దేశ, రాష్ట్రాల దౌర్భాగ్య మనుకోవాలా...!!
కనీసం..ఇంగిత జ్ఞానం లేకుండా ఎలా.... భ్రతకగలుగుతున్నారు! ఏమిటీ ఈ... నైరాశ్యం! ఎందుకిలా..జరుగుతుంది. ఈ బ్రతుకుల్లో...ఆశలు ఉదయించే..దెప్పుడు! తనకు తానుగా ఆనందంగా జీవించే..దెప్పుడు! ఆటవిక రాజకీయాలకు స్వస్థి పలికేదెప్పుడు!! ఆశల నిరాశల నిరాగమ గీతిక! ఆనందాలు వెదజల్లే సరాగాల మాలిక!!
మనిషి పుట్టిక గొప్ప వరమైతే! జీవితం.. దౌర్భాగ్యాల రోదన!! ఊహించని విధి విలాసం! ఊహకందని హృదయ విలాపం!! అందమైన అనురాగ బంధం! జీవితమే అగమ్య గోచరం!!
మారుతున్న నాగరిక సమాజంలో... మన అడుగుల కదలికలో మార్పన్నది తప్పనిసరి!
జాతి మనుగడకు నీవే దిక్సూచి కాగలగాలి! నీ దృష్టి, నీ ఆశయం నీ హృదయాంతరాల్లో మెదులుతున్న నీకు అనుభవపూర్వకమైన నీ దుర్భర జీవితానికీ, జాతి పరంగా అణగ ద్రొక్కబడిన, దౌర్జన్యఖాండ లకు తిలోదకాలిస్తూ...రాజకీయం అన్నది...ఏవడబ్బ సొత్తు కాదు! నీలో ఓ ప్రజానాయకుడు ఉద్భావించాలి! నీ జాతి ఔనత్యాన్ని కాపాడుకో గలిగినట్టు వాళ్ళముంగిటకు తీసుకుపోగలిగినట్లయితే నీ జాతికి నీవే నాయకుడివి. నీ కుల యావత్తుని రాజకీయ చైతన్యవంతులుగా మలచ గలిగే ఓర్పు,నేర్పు నీలో ఉన్ననాడు ఎవడో..మోచేతినీళ్లు త్రాగడానికి ఉబలాటమెందుకు! మనం అనుకుంటే,సాధించి తీరగలం మన ఆశయం గొప్పది కావాలి! మన ప్రత్యర్థిని ఎదుర్కొ నేందుకు శక్తులన్నింటినీ కూడగట్టుకోవాలి! మనకున్న దారులన్నింటినీ
దిగ్బంధన చేయాలి! వాటిపై ప్రత్యేక నిఘా ఉంచాలి! ఎత్తుకు పైఎత్తు వేయాలి! రాజకీయ సమీకరణలు చేయాలి! ప్రత్యర్థులను ఎప్పుడూ తక్కు వంచనా... వేయకూడదు! అనుక్షణం నా అనుకున్న వాళ్లతో.. మమేకం కావాలి.వీటన్నింటిపై దృష్టి పెట్టగలి గిననాడు నీ కులపరంగా నీవే నాయకుడివి కావడం నీవు అనుకున్న పదవి యోగం నిన్ను వరిస్తుంది. సాధన చేస్తే... సాధించలేనిదంటూ... ఏమీలేదు! ఇది నిజం! జీవిత సత్యం!! రానున్న రోజుల్లో... రాజకీయాలకు ఊతమిచ్చి పల్లెల్లో...గ్రామాల్లో... పట్టణాల్లో...జిల్లాల్లో... రాష్ట్రాల్లో...రాజకీయ ఉద్యమ నాయకుడిగా రాజకీయ చతురతతో తిరుగులేని స్వచమైన ప్రజా స్వామ్య ప్రతినిధిగా వెలుగొంది! ప్రజా సంక్షేమం లో... నిస్వాతుడివై, నిన్ను నమ్ముకున్న ప్రజల్లో వెలుగు నింపే... అధినాయకుడివై వర్ధిల్లు గాక!
అందరి పుట్టిక ఒకటే అందరి రక్తం ఒకటే
అందరూ పీల్చే గాలి ఒకటే
పేదా,గొప్పా తక్కువా, ఎక్కువా..అని ఎవరు చెప్పారు!
ఎందుకీ తర,తమ భేదాలు!
మనిషిని, మనిషిగా చూసే
మానవతా దృక్పథం కలిగే
సభ్య సమాజం ఏర్పడాలి!
సమ సమాజ సంస్కృతికి,
స్వచ్ఛమైన ప్రజాస్వామ్య
వ్యవస్థ కొరకు "యువతరం" పునాదు వేయగలగాలి!
కులాల కలగలుపుతో...
రాజకీయ ప్రక్షాళన చేయాలి!
కులాల వివక్షతను పారద్రోలాలీ!
అంటరాని తనాన్ని నిర్మూలించాలి!
భారత సంస్కృతికి ప్రతీ ఒక్కరూ....
పునఃరంకిత మవ్వాలి!!
సర్వే జన సుఖినో.. భవంతు!

**రచన: మైలపల్లి మమతా నాగరాజు**
99668 76796
L I G -C/529, సాగర్ నగర్, విశాఖపట్నం జిల్లా 530 045. ఆంధ్రప్రదేశ్.

# 22ఏలో మీ భూమి ఉందా? అయితే ఏం చేయాలి?

- **నిషేధిత జాబితాలో భూమి ఉంటే అమ్మకం..కొనుగోలు బంద్!**
- **రిజిస్ట్రేషన్ నుంచి బ్యాంకు రుణం వరకు చిక్కులే.**
- **పొరపాటున పట్టా భూమి చేరితే ఆధారాలతో కలెక్టర్‌కు దరఖాస్తు.**
- **భూమి కొనేముందు 22ఏ స్థితిని తప్పనిసరిగా పరిశీలించాలి.**
- **22ఏ పై భూ యజమానుల్లో ఆందోళన పరిష్కారంపై ప్రభుత్వం కసరత్తు**
- **22ఏ అంటే ఏమిటి? 7 కీలక ప్రశ్నలకు సమాధానాలు**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 14 (జన సంఘర్షణ)
తెలంగాణలో ఇప్పుడు భూముల విషయంలో ఎక్కువగా వినిపిస్తున్న మాట 'సెక్షన్ 22ఏ' ఏళ్ల తరబడి తమ ఆధీనంలో ఉన్న భూమి. పట్టాదారు పాసుపుస్తకం ఉంది.పాత రిజిస్ట్రేషన్ పత్రాలున్నాయి.అయినా అమ్మడానికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళితే మీ భూమి నిషేధిత జాబితాలో ఉంది. అనే సమాధానం వస్తే యజమాని పరిస్థితి ఏమిటి?
అప్పటికే కొనుగోలుదారుడితో అగ్రిమెంట్ చేసుకుని ఉంటే? అడ్వాన్స్ తీసుకుని ఉంటే? అత్యవసర అవసరానికి భూమిని అమ్మాలని నిర్ణయించుకుంటే? బ్యాంకులో తాకట్టు పెట్టి రుణం తీసుకోవాలనుకుంటే? ఒక్కసారిగా అన్ని లావాదేవీలకూ బ్రేక్ పడే పరిస్థితి ఏర్పడుతుంది. అందుకే 22ఏ అంటే ఏమిటి? ఏ భూములు ఇందులోకి వస్తాయి? మన భూమి ఈ జాబితాలో ఉందో ఎలా తెలుసుకోవాలి? పొరపాటున చేరితే ఎలా తొలగించుకోవాలి? అనే అంశాలపై ప్రతి భూ యజమానికి కనీస అవగాహన అవసరం.

**1. అసలు సెక్షన్ 22ఏ అంటే ఏమిటి?**

రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ కింద కొన్ని రకాల స్థిరాస్తుల రిజిస్ట్రేషన్‌ను ప్రభుత్వం నిషేధించవచ్చు. ప్రభుత్వ ఆస్తులు,నిర్దిష్ట రక్షణ ఉన్న భూములు అక్రమంగా ఇతరుల పేర్లకు బదిలీ కాకుండా నిరోధించడం దీని ప్రధాన ఉద్దేశం.ఒక భూమి నిషేధిత ఆస్తుల జాబితాలోకి వస్తే సాధారణంగా దాని రిజిస్ట్రేషన్‌కు అడ్డంకి ఏర్పడుతుంది. అందువల్ల భూమి కొనుగోలు చేసే సమయంలో కేవలం పాసుపుస్తకం, పాత డాక్యుమెంట్లు చూసి నిర్ణయం తీసుకోవడం సరిపోదు. ఆ భూమి ప్రస్తుతం నిషేధిత జాబితాలో ఉందా లేదా అన్నది కూడా నిర్ధారించుకోవాలి.

**2. 22ఏ జాబితాలో ఎలాంటి భూములు ఉండవచ్చు?**

చట్టంలోని సంబంధిత నిబంధనలు, ప్రభుత్వ రికార్డుల ఆధారంగా పలు రకాల భూములు నిషేధిత జాబితాలో ఉండవచ్చు.ప్రభుత్వ భూములు,కొన్ని అసైన్డ్ భూములు,దేవాదాయ శాఖకు చెందిన ఆస్తులు, వక్ఫ్ ఆస్తులు, సీలింగ్ మిగులు భూములు, ప్రభుత్వ ప్రయోజనం లేదా హక్కులతో ముడిపడిన కొన్ని ఆస్తులు ఇందులోకి రావచ్చు. కొన్ని సందర్భాల్లో న్యాయస్థానాల ఉత్తర్వులు లేదా ఇతర చట్టపరమైన ఆంక్షల కారణంగానూ రిజిస్ట్రేషన్ నిలిచిపోవచ్చు. అయితే 22ఏలో కనిపించే ప్రతి భూమి విషయంలో కారణం ఒకటే అని భావించకూడదు. ఆ సర్వే నంబరు ఏ కారణంతో, ఏ రికార్డు లేదా ఉత్తర్వు ఆధారంగా నిషేధిత జాబితాలోకి వచ్చిందో తెలుసుకోవడం అత్యంత ముఖ్యం.

**3. మీ భూమి 22ఏలో చేరితే ఏమవుతుంది?**

భూ యజమానులకు అసలు సమస్య ఇక్కడే మొదలవుతుంది. నిషేధం వర్తించే స్థితిలో భూమి అమ్మకం లేదా కొనుగోలు రిజిస్ట్రేషన్ జరగదు. గిఫ్ట్ డీడ్, తనఖా వంటి ఇతర రిజిస్టర్డ్ లావాదేవీలకూ ఆటంకాలు ఎదురవుతాయి. ఆస్తిపై స్పష్టమైన రిజిస్ట్రేషన్ సమస్య ఉంటే బ్యాంకు రుణం పొందడంలోనూ ఇబ్బందులు రావచ్చు.ముఖ్యంగా ఇప్పటికే అమ్మకానికి ఒప్పందం చేసుకున్నవారికి ఇది తీవ్ర సమస్యగా మారుతుంది. అడ్వాన్స్ తీసుకున్న తర్వాత 22ఏ విషయం బయటపడితే కొనుగోలుదారు--అమ్మకందారు మధ్య వివాదాలకు కూడా అవకాశం ఉంటుంది.అందుకే అగ్రిమెంట్‌కు ముందే భూమి చట్టపరమైన స్థితిని పరిశీలించడం మంచిది.

**4. మన భూమి 22ఏలో ఉందో ఎలా తెలుసుకోవాలి?**

భూమికి సంబంధించిన తాజా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ రికార్డులను పరిశీలించాలి. తెలంగాణలో వ్యవసాయ భూముల వివరాలకు ప్రస్తుతం అమలులో ఉన్న భూభారతి వ్యవస్థ, రిజిస్ట్రేషన్ సంబంధిత వివరాలకు స్టాంపులు--రిజిస్ట్రేషన్ల శాఖ అధికారిక వ్యవస్థ ద్వారా అందుబాటులో ఉన్న సమాచారాన్ని పరిశీలించవచ్చు. అంతటితో ఆగకుండా అవసరమైతే సంబంధిత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, రెవెన్యూ అధికారులను సంప్రదించి స్పష్టత తీసుకోవాలి.భూమి కొనుగోలు చేసే వ్యక్తి ముఖ్యంగా: సర్వే నంబరు, విస్తీర్ణం, యజమాని పేరు, పాత లింక్ డాక్యుమెంట్లు, ఎన్‌కంబ్రెన్స్ సర్టిఫికెట్ (ఈ సీ), రెవెన్యూ రికార్డులు, నిషేధిత ఆస్తుల స్థితి



తదితర అంశాలను పరిశీలించడం మంచిది. పెద్ద మొత్తంలో లావాదేవీ అయితే న్యాయ నిపుణుడితో టైటిల్ వెరిఫికేషన్ చేయించుకోవడం మరింత సురక్షితం.

**5. పట్టా భూమి పొరపాటున 22ఏలో చేరితే ఏం చేయాలి?**

ఇదే ప్రస్తుతం అనేక మంది భూ యజమానులను వేధిస్తున్న ప్రధాన ప్రశ్న.ముందుగా "నా భూమిని ఏ కారణంతో నిషేధిత జాబితాలో చేర్చారు?" అనే విషయాన్ని అధికారికంగా తెలుసుకోవాలి. సంబంధిత కార్యాలయానికి రాతపూర్వకంగా దరఖాస్తు చేసి, భూమి 22ఏలో నమోదవడానికి ఆధారమైన ఉత్తర్వు, జీవో, ప్రొసీడింగ్స్ లేదా ఇతర రికార్డు వివరాలను కోరవచ్చు.ఆ తర్వాత భూమి నిజంగా ప్రైవేటు పట్టా భూమేనని నిరూపించే ఆధారాలను సమర్పించాలి. దరఖాస్తుకు ఉపయోగపడే పత్రాలుపాత రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, లింక్ డాక్యుమెంట్లు, పట్టాదారు పాసుపుస్తకం/సంబంధిత రెవెన్యూ రికార్డులు, పాత పహాణీలు లేదా అందుబాటులో ఉన్న భూ రికార్డులుఎన్‌కంబ్రెన్స్ సర్టిఫికెట్ (ఈ సీ)మ్యూటేషన్‌కు సంబంధించిన పత్రాలు, లేఅవుట్ అనుమతులు ఉంటే వాటి కాపీలుగతంలో ఇచ్చిన ప్రభుత్వ ఉత్తర్వులు లేదా ప్రొసీడింగ్స్ సంబంధిత కోర్టు తీర్పులు ఉంటే వాటి ధ్రువీకృత కాపీలు అసలు పత్రాలను ఎవరికి పడితే వారికి ఇవ్వకుండా, అవసరమైన చోట ధ్రువీకరించిన/స్పష్టమైన ప్రతులను సమర్పించి రిసీవింగ్ తీసుకోవడం మంచిది.

**6. ఎవరిని సంప్రదించాలి?**

భూమి ఏ 22ఏ వర్గం కింద నమోదైందనే దానిపై పరిష్కార మార్గం ఆధారపడి ఉంటుంది. సంబంధిత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ముందుగా కారణాన్ని తెలుసుకోవచ్చు. రెవెన్యూ రికార్డులతో ముడిపడిన సమస్య అయితే సంబంధిత రెవెన్యూ యంత్రాంగం, జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని సంప్రదించాల్సి రావచ్చు.22ఏ లోని కొన్ని వర్గాలకు సంబంధించిన అభ్యంతరాలు జిల్లా కలెక్టర్ పరిధిలో పరిష్కారానికి వస్తాయి.అయితే దేవాదాయ, వక్ఫ్, అసైన్డ్ లేదా కోర్టు ఉత్తర్వులతో సంబంధం ఉన్న భూముల్లో ప్రత్యేక చట్టాలు, నిబంధనలు వర్తించే అవకాశం ఉంటుంది.కోర్టు ఉత్తర్వు కారణంగా రిజిస్ట్రేషన్‌పై నిషేధం ఉంటే కేవలం రెవెన్యూ దరఖాస్తుతో అది తొలగిపోతుందని భావించకూడదు.అవసరమైతే న్యాయస్థానాన్నే ఆశ్రయించాల్సి ఉంటుంది.

**7. భూమి కొనేవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటి?**

ఇల్లు, ప్లాట్ లేదా వ్యవసాయ భూమి కొనుగోలు జీవితంలో చేసే అతిపెద్ద పెట్టుబడుల్లో ఒకటి. అందుకే తొందరపడి అడ్వాన్స్ ఇవ్వడం ప్రమాదకరం. ముందు భూమి రికార్డులు - తర్వాతే అడ్వాన్స్ అనే సూత్రాన్ని పాటించడం ఉత్తమం. "ఇప్పుడే అడ్వాన్స్ ఇవ్వండి.. రేపే రేటు పెరుగుతుంది", "అన్ని క్లియర్‌గా ఉన్నాయి", "రిజిస్ట్రేషన్ సమయంలో చూసుకుందాం" వంటి మాటలను మాత్రమే నమ్మి పెద్ద మొత్తంలో డబ్బు చెల్లించకూడదు. 22ఏ స్థితితో పాటు టైటిల్, జుజ, కోర్టు వివాదాలు, రోడ్డు యాక్సెస్, సర్వే హద్దులు, లేఅవుట్ అనుమతులు, ప్రభుత్వ లేదా ఇతర సంస్థల క్లెయిమ్‌లు ఉన్నాయా అనే విషయాలను కూడా పరిశీలించాలి.

**22ఏ ఎందుకు ఇంత పెద్ద సమస్యగా మారింది?**

ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించేందుకు రూపొందించిన చట్టపరమైన వ్యవస్థే అయినప్పటికీ, రికార్డుల్లో తేడాలు లేదా పాత-కొత్త భూ రికార్డుల మధ్య వ్యత్యాసాలు ఉన్న సందర్భాల్లో ప్రైవేటు భూ యజమానులు కూడా ఇబ్బందులుఎదుర్కొంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పాత పహాణీలు ఒకలా ఉండటం, తరువాత పట్టాలు లేదా ఇతర హక్కులు రావడం, కాలక్రమంలో భూముల స్వభావం లేదా రికార్డులు మారడం వంటి అంశాలు కొన్ని వివాదాలకుకారణమవుతున్నాయి.అందువల్ల "22ఏలో ఉంది" అనే ఒక్క మాటతో వ్యవహారం ముగించకుండా, ఆ భూమి ఎందుకు జాబితాలోకి వచ్చిందనే మూల కారణాన్ని గుర్తించడం పరిష్కారంలో కీలకం. రాజకీయంగానూ వేడెక్కిన 22ఏ వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లోనూ చర్చనీయాంశమైంది. ప్రతిపక్ష పార్టీలు ప్రైవేటు పట్టా భూములు నిషేధిత జాబితాలోకి వెళ్లడం వల్ల సామాన్య ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆరోపిస్తున్నాయి. దరఖాస్తుల పరిష్కారానికి నిర్దిష్ట కాలపరిమితి ఉండాలని, దరఖాస్తు ఏ దశలో ఉందో ఆన్‌లైన్‌లో తెలుసుకునే ట్రాకింగ్ వ్యవస్థ ఉండాలని కూడా డిమాండ్లు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం మాత్రం అర్హులైన భూ యజమానులకు అన్యాయం జరగనివ్వబోమని, చట్టపరమైన--సాంకేతిక సమస్యలను పరిష్కరించే చర్యలు చేపడుతున్నామని చెబుతోంది.

**ప్రజలు ఆందోళన చెందొద్దు:** మంత్రి పొంగులేటి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇటీవల 22ఏ నిషేధిత భూముల అంశంపై స్పందిస్తూ, చట్టబద్ధంగా అర్హులైన వారికి న్యాయం చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో రాజీ ఉండదని, అదే సమయంలో నిజమైన ప్రైవేటు భూ యజమానులు అనవసరంగా ఇబ్బందులు పడకుండా సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం చెబుతోంది. రిజిస్ట్రేషన్ తిరస్కరణ విషయంలోనూ కారణాలను స్పష్టంగా తెలియజేసే విధానం ఉండాలని అధికారులకు సూచనలు చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది. 22ఏ నోటీసు కనిపిస్తే భయపడకండి.. కానీ నిర్లక్ష్యం చేయకండి! మీ భూమి 22ఏ జాబితాలో కనిపించగానే భూమి పోయిందని భావించాల్సిన అవసరం లేదు. అదే సమయంలో "నా దగ్గర పాసుపుస్తకం ఉంది కదా.. ఏమీ కాదు" అని నిర్లక్ష్యం చేయడమూ సరికాదు. మొదట నిషేధానికి గల అధికారిక కారణాన్ని తెలుసుకోవాలి. తర్వాత మీ హక్కును నిరూపించే పాత నుంచి తాజా వరకు అన్ని పత్రాలను ఒకేచోట సమీకరించాలి. సంబంధిత అధికారికి దరఖాస్తు చేసి రిసీవింగ్ తీసుకోవాలి. పరిష్కారం కాకపోతే భూ చట్టాలపై అనుభవం ఉన్న న్యాయవాది సలహాతో తదుపరి చర్యలు చేపట్టాలి. భూమి కొనుగోలుదారులకు 'మెతుకు సీమ టైమ్స్' సూచన
లక్షలు.. కోట్ల రూపాయలతో భూమి కొంటున్నప్పుడు కొన్ని గంటలు పత్రాల పరిశీలనకు కేటాయించడం నష్టం కాదు. పాసుపుస్తకం ఉందని మాత్రమే కొనొద్దు.రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ఉందని మాత్రమే నమ్మొద్దు.ఈ సి ఒక్కటే చూసి నిర్ణయం తీసుకోవద్దు. 22ఏ/నిషేధిత జాబితా స్థితి + టైటిల్ చైన్ + రెవెన్యూ రికార్డులు + కోర్టు వివాదాలు + భౌతిక సర్వే అన్నీ పరిశీలించిన తర్వాతే అడ్వాన్స్ ఇవ్వడం సురక్షితం.భూమి కొనేముందు తెలుసుకోండి.కొనుగోలు చేసిన తర్వాత కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి తెచ్చుకోకండి!

# బీటి రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలి

- **మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 14 (జన సంఘర్షణ)
మెదక్ జిల్లా నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ కమాన్ నుంచి నందగోకుల్ గ్రామం వరకు డాంబర్ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నస్కల్, నందగోకుల్, చల్మెడ గ్రామాల మీదుగా కమాన్ వరకు సుమారు 15 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ.13 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయని, అనంతరం తాము ఎన్నికల్లో ఓడిపోవడంతో రోడ్డు పనులను పట్టించుకునే వారు లేకుండా పోయారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు గెలిచి ఏడాది పూర్తవుతున్నా రోడ్డు పనులపై దృష్టి సారించలేదని ఆరోపించారు. దీంతో నస్కల్ గ్రామస్తులు నిరాహార దీక్ష చేపట్టగా, కేవలం నాలుగు కిలోమీటర్ల మేర పనులు చేపట్టి మిగిలిన రోడ్డు పనులను అర్ధంతరంగా వదిలేశారని అన్నారు.



# బీజేపీ యువ మోర్చా అధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

- 1947 నుండి 2002 వరకు జాతీయ జెండా ను ఆవిష్కరణ చెయ్యకుండా అడ్డుకున్నా కాంగ్రెస్ ప్రభుత్వం
- డా జాడి రామరాజు నేత

ములుగు జిల్లా, ఏటూరునాగారం మండలం, ఆగష్టు 14(జనసంఘర్షణ):
 ఏటూరు నాగారం మండల కేంద్రంలో బీజేపీ యువమోర్చ ప్రధాన కార్యదర్శి కొండగొర్ల రాంబాబు ఆధ్వర్యంలో ఏటూరునాగారం జడ్పీఎస్ పాఠశాల నుండి బస్సు స్టాండ్ వరకు హర్ ఘర్ తిరంగా ర్యాలీ తియ్యడం జరిగింది. హర్ ఘర్ తిరంగా ర్యాలీకి ముఖ్య అతిధిగా బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు డా జాడి రామరాజు నేత హాజరై మాట్లాడుతూ.. మొదటి సారి బ్రిటిష్ ప్రభుత్వం పైన స్వతంత్ర పోరాటం జరుగుతున్నా క్రమంలో 1906 ఆగస్టు 7వతేదిన జెండా ఆవిష్కరణ చేసినారు. పశ్చిమబెంగాల్ రాష్ట్ర రాజధాని కలకత్తా తిరంగా ర్యాలీ తియ్యడం జరిగింది తర్వాత 1907 కామాపర్మిలో ఆవిష్కరణ చేసినారు 1921లో పింగళి వెంకయ్య రూపొందించిన జెండాను అధికారికంగా 1931లో పూర్తిగా జాతీయ జెండాను ఆమోదం పొందిన తర్వాత 1947 ఆగస్టు 15వరకు తీవర్ణ పథకంను ఆవిష్కరణ చేసి ఎర్రకోటపై జెండా ఎత్తిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం కొన్ని మతాలకు అనుకూలంగా ఉండడం కోసం మన జాతీయ జెండా గురించి కూడా ఎవ్వరికి తెల్వకుండా సంవత్సరానికి ఒక్కసారి మాత్రామే జెండా ఎర్రకోట పైన ఎత్తిన తర్వాత ఎవ్వర్నీ ముట్టుకోకుండా అడ్డుకున్నాదాని అన్నారు అదేవిదంగా కాంగ్రెస్ ప్రభుత్వం కొన్ని మతాలకు అనుకూలంగా ఉండడం కోసం జాతీయ జెండాను పట్టుకొని తిరంగా ర్యాలీలు చెయ్యకుండా అడ్డుకున్నారని అన్నారు. స్వాతంత్ర కోసం జెండా మూడు రంగుల జెండా కోసం 5లక్షల 55వేల మంది మరణించారాని అన్నారు. కానీ జాతీయ జెండాను కూడా భారతీయులకు అందుబాటులో లేకుండ చెయ్యడం వలన 1950లో నవీన్ జిందల్ జాతీయ త్రివర్ణ పథకాన్ని ఆవిష్కరణ చెయ్యాలని కోర్ట్ లో కేసు వేసిన కోర్ట్ తీర్పు 2022లో దేశప్రధాన మంత్రి అటల్ బీహార్ వాజ్ పెయి ఆధ్వర్యంలో కోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత జాతీయ జెండాను ప్రతి ఇంటిపై త్రి వర్ణ పథకం ను ఎగిరెస్తున్నారని అన్నారు. అదేవిదంగా కాంగ్రెస్ ప్రభుత్వం 2004నుండి 2014 వరకు జాతీయ త్రివర్ణ పథకం ను అడ్డుకున్నప్పటి దేశ ప్రధాన మంత్రి గా ఎన్నికైన తర్వాత జాతీయ జెండా ను ప్రతి ఇంటిపై ఎగిరే విదంగా చూస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రతి భారతీయుడు త్రివర్ణ పథకం గురించి తెలుసుకోవాలచిన భాద్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదాని బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షులు డా జాడి రామరాజు నేత అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా





ఉపాధ్యక్షులు ఎర్రల ఎల్లయ్య, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి గాడిచర్ల రాజశేఖర్, మహిళ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పలక.గంగ, మహిళా మోర్చా అధ్యక్షురాలు ప్రేమలత, మహిళా నాయకురాలు మలకం. స్వరూప, మలకం. రవళి దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు వావిలాల. జనార్దన్ కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు ఇర్సవడ్ల. జగన్ మండల ఉపాధ్యక్షులు. అటిక కృష్ణ బజరంగ్ దళ్ సభ్యులు, పాఠశాల అధ్యాపకులు షోషల్ మీడియా కన్వీనర్. దుర్గం. శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

# పూలే దంపతుల విగ్రహాలను ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్/ఆగస్టు 14/జన సంఘర్షణ)
 హైదరాబాద్: సామాజిక సమానత్వం, విద్య, మహిళా సాధికారత కోసం జీవితాంతం పోరాడిన మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల సేవలను స్మరించుకుంటూ వారి విగ్రహాలను హైదరాబాద్‌లో ఘనంగా ఆవిష్కరించారు. నెక్లెస్ రోడ్ ఐమ్యాక్స్ సర్కిల్ ఎదురుగా ఉన్న హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం సమీపంలో ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, ఆర్. కృష్ణయ్య, సురేష్ షెట్కర్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, నవీన్ యాదవ్, మందుల సామేల్,







మక్కన్ సింగ్ రాజ్ ఠాగూర్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అణగారిన వర్గాల అభ్యున్నతి, విద్యా వ్యాప్తి, సామాజిక సమానత్వం కోసం పూలే దంపతులు చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళల విద్య కోసం సావిత్రిబాయి పూలే చేసిన కృషి దేశ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని కొనియాడారు. పూలే దంపతుల విగ్రహాలను హైదరాబాద్‌లో ప్రతిష్ఠించడం వారి ఆశయాలను భవిష్యత్ తరాలకు చాటిచెప్పే గొప్ప కార్యక్రమమని పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు.

# ముప్పై ఏళ్ల ఉద్యమ జ్వాల.. మౌన గొంతులకు మాట నేర్పిన మాదిగ ఉద్యమం

నిజామాబాద్, ఆగస్ట14/జన సంఘర్షణ)
 మూడు దశాబ్దాలుగా అణగారిన వర్గాల హక్కుల కోసం సాగుతున్న మాదిగ ఉద్యమం ఎన్నో పోరాటాలకు, త్యాగాలకు సాక్ష్యంగా నిలిచిందని ఎమ్మార్పీఎస్-ఎంఎస్పీ అనుబంధ సంఘాల నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి మాసాయిపేట యాదగిరి మాదిగ అన్నారు. శుక్రవారం నిజామాబాద్ ఆర్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మాసాయిపేట యాదగిరి మాదిగ మాట్లాడుతూ.. "ముప్పై ఏళ్ల ఉద్యమం అణచివేత చీకట్లలో అక్షరమై వెలిగింది.. ఎన్నో గుండెల గర్జనలకు, కన్నీటి చరిత్రలకు వేదికగా నిలిచింది" అని అన్నారు. న్యాయం కోసం సాగిన పోరాటంలో వెనక్కి తగ్గకుండా, నిరాశకు తావివ్వకుండా ఉద్యమం ముందుకు సాగిందన్నారు. మందకృష్ణ మాదిగ అడుగు పడితే మాదిగ గుండె మేల్కొంటుందని, ఆయన గొంతు గర్జిస్తే అణగారిన



ఆశలు చిగురిస్తాయని పేర్కొన్నారు.రిజర్వేషన్ల కోసం మాత్రమే తమ పోరాటం కాదని, సామాజిక సమానత్వం, హక్కుల సాధన, తరతరాల భవిష్యత్తు కోసం ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. మట్టిలో పుట్టిన ప్రతి మనిషికి ఆకాశాన్ని అందుకోవాలనే ఆశ ఉండాలని, ప్రతి బిడ్డ జీవితంలో విద్య ద్వారా కొత్త వెలుగు రావాలని ఆకాంక్షించారు. తల్లుల కన్నీళ్లకు పిల్లల చిరునవ్వులే సమాధానం కావాలన్నారు. "ముప్పై ఏళ్ల ఉద్యమ జ్వాల ఇంకా ఆరిపోలేదు. గుండెల్లో వెలిగిన ఈ దీపం కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపుతుంది. ఇది ఒక్క గొంతు కాదు.. వేల గొంతుల మహాగర్జన. లక్షల అడుగుల ఉద్యమ పయనం" అని యాదగిరి మాదిగ అన్నారు. న్యాయం దక్కే వరకు, సమానత్వం సాధించే వరకు, పిల్లల భవిష్యత్తు వెలిగే వరకు ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సంస్థను గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని జిల్లా నాయకులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, మండల ఇన్‌చార్జిలు తమ పరిధిలోని గ్రామ, మండల కమిటీలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఉన్నత పదవులు పొందిన ముగ్గురు మహిళా నాయకురాళ్లను కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా టౌన్ ఇన్‌చార్జి పోశెట్టి మాదిగ, సీనియర్ నాయకులు నాగభూషణం, భూమయ్య, పద్మ, యమునా, సావిత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా పూర్తి వందేమాతరం గీతం ఆలాపన ఆనందదాయకం

- ప్రధాని మోదీకి బీజేపీ కృతజ్ఞతలు.
- బిజెపి నాయకులు తెలిపారు.



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 14 (జన సంఘర్షణ)
 మెదక్ జిల్లా రామాయంపేట భారత స్వాతంత్ర్య స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిన వందేమాతరం గీతాన్ని పూర్తి రూపంలో ఆలపించాలనే నిర్ణయం దేశవ్యాప్తంగా అమలులోకి రావడం ఆనందదాయకమని భారతీయ జనతా పార్టీ నాయకులు పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో వందేమాతరం గీతానికి ఉన్న చారిత్రక ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేసేలా సుమారు మూడు నిమిషాల పాటు పూర్తి గీతాన్ని ఆలపించే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పార్లమెంట్‌లో ఆమోదం పొందిన పూర్తి వందేమాతరం గీతాన్ని చరణాలతో సహా ఆలపించడం దేశభక్తి భావాన్ని బలపరుస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా GO Rt No.1177, GAD ద్వారా మూడు నిమిషాల పాటు వందేమాతరం గీతాన్ని ఆలపించేలా ఉత్తర్వులు జారీ చేయడం స్వాగతించదగ్గ విషయమని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కలలుగన్న దేశభక్తి, జాతీయ ఐక్యత స్ఫూర్తితో పూర్తి వందేమాతరం గీతాన్ని దేశవ్యాప్తంగా ఆలపించడం ప్రతి భారతీయుడికి గర్వకారణమని, ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ తరఫున ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి హృదయపూర్వక కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు,జిల్లా ఉపాధ్యక్షులు తీగల శ్రీనివాస్ గౌడ్, రామాయంపేట మున్సిపల్ కమిషనర్ శంకర్ గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల శేఖర్,పట్టణ అధ్యక్షుడు శీలం అవినాష్ రెడ్డి, మండల అధ్యక్షుడు నవీన్ గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి అనిల్, యువ మోర్చా నాయకులు బాసం అనిల్, వెంకట్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రోస్ స్వచ్ఛంద స్వచ్ఛంద సంస్థ ఆధ్యాయంలో 40 కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 14 (జన సంఘర్షణ)




 గ్రోస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 40 కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరిగింది.గత 12 సంవత్సరాలుగా విజయవంతంగా నిత్యవసర సరుకుల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా ఈ రోజులు స్వాతంత్ర దినోత్సవ మహోత్సవాల సందర్భంగా ఇట్టి నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరిగిందని సెక్రెటరీ జాయ్ మూర్రే తెలిపారు.

# నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు..

- దోజర్ పట్టివేత

సాలూరు/ఆగస్టు 14/జన సంఘర్షణ)



 సాలూరు: మండలంలోని తగ్గెల్లి మంజీరా పరివాహక ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారంతో రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. ఇంటి నిర్మాణ అవసరాల కోసం ఇసుక తరలింపునకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చినప్పటికీ, వాటిని పక్కనపెట్టి డోజర్‌తో ఇసుకను తవ్వి తరలిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో రెవెన్యూ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. అక్కడ ఇసుకను డోజర్‌తో తవ్వుతున్నట్లు గుర్తించి, డోజర్‌ను పట్టుకున్నారు. నిబంధనలను ఉల్లంఘించి ఇసుక తవ్వకాలకు పాల్పడుతున్న వారిపై అధికారులు తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

**అధికారుల హెచ్చరిక...**

ప్రభుత్వ అనుమతుల పరిధిని దాటి ఇసుక తవ్వకాలు, అక్రమ రవాణాకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని రెవెన్యూ అధికారులు హెచ్చరించినట్లు సమాచారం. అనుమతులు ఉన్న ప్రాంతం, నిర్దేశించిన పరిమితుల్లోనే ఇసుకను తవ్వాలని, నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలు, యంత్రాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ ఘటనపై ఆర్ఐ శంకర్, ఆనంద్ ఆధ్వర్యంలో అధికారులు తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. మంజీరా పరివాహక ప్రాంతంలో అక్రమ ఇసుక తవ్వకాలకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులు మరింత కఠినంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు.

# ఎత్తొండలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- జాతీయ జెండా ఆవిష్కరణకు గ్రామ ప్రజలకు సర్పంచ్ శ్వేతా సూర్యకాంత్ ఆహ్వానం

ఎత్తొండ, /ఆగస్టు 14/జన సంఘర్షణ):
 భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎత్తొండ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామ సర్పంచ్ శ్వేతా సూర్యకాంత్ ఆధ్వర్యంలో ఆగస్టు 15న జాతీయ జెండా ఆవిష్కరణతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహించ నున్నారు. ఈ సందర్భంగా ఆగస్టు 15, శనివారం ఉదయం 8 గంటలకు గ్రామ పంచాయతీ వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ శ్వేతా సూర్యకాంత్ తెలిపారు. వేడుకలకు గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువతీ యువకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు. దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటే ఈ వేడుకల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సర్పంచ్ శ్వేతా సూర్యకాంత్ పిలుపునిచ్చారు.






# ఆగి ఉన్న ప్రైవేట్ బస్సును వెనుక నుంచి ఢీకొట్టిన కంటైనర్..

- ఇద్దరు మహిళలు మృతి
- టైర్ కింద పడి ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి..
- మరో ఇద్దరి పరిస్థితి విషమం




నిజామాబాద్ బ్యూరో/ఆగస్టు 13/జన సంఘర్షణ)

ఆర్మూర్: విహారయాత్రకు బయలుదేరిన ప్రయాణికులకు రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్ సమీపంలో జాతీయ రహదారి-44పై శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి హైదరాబాద్‌లోని చిన్నజీయర్ స్వామి ఆశ్రమాన్ని సందర్శించేందుకు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో ప్రయాణికులు బయలుదేరారు. గోవింద్‌పేట్ సమీపంలో బస్సు టైర్ పంచర్ కావడంతో డ్రైవర్ బస్సును రహదారి పక్కన నిలిపాడు. ఈ సమయంలో కొందరు ప్రయాణికులు బస్సు నుంచి దిగి రహదారి మధ్యలోని డివైడర్‌పై కూర్చున్నారు. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన కంటైనర్ అదుపుతప్పి ఆగి ఉన్న ప్రైవేట్ బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డివైడర్‌పై ఉన్న మహిళలపై కంటైనర్ టైర్ దూసుకెళ్లడంతో మాధవి, సుజాత అనే ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. మరో ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడగా, వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో సుమారు పది మంది ప్రయాణికులు గాయపడినట్లు సమాచారం. క్షతగాత్రులను హుటాహుటిన ఆర్మూర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి గురైన వారంతా మహారాష్ట్రకు చెందినవారిగా తెలుస్తోంది.

**ఘటనాస్థలికి పోలీసులు.. కంటైనర్ డ్రైవర్ పరార్**

సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. ప్రమాదం అనంతరం కంటైనర్ డ్రైవర్ అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. అతని కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

**వాహనదారులకు అధికారుల హెచ్చరిక**

జాతీయ రహదారులపై వాహనం టైర్ పంచర్ కావడం లేదా సాంకేతిక లోపం తలెత్తిన సమయంలో ప్రయాణికులు రహదారిపై, ముఖ్యంగా డివైడర్లపై కూర్చోవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. వాహనాన్ని సాధ్యమైనంత సురక్షిత ప్రాంతంలో నిలిపి, ప్రయాణికులను రహదారికి దూరంగా తరలించాలని సూచిస్తున్నారు. అదే విధంగా జాతీయ రహదారులపై వాహనాలను అతివేగంగా నడపకుండా, ముందున్న వాహనాలకు తగినంత దూరం పాటించాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు. చిన్న నిర్లక్ష్యం నిండు ప్రాణాలను బలితీసుకుంటుందని, వాహనదారులు, ప్రయాణికులు తప్పనిసరిగా రహదారి భద్రతా నిబంధనలు పాటించాలని అధికారులు సూచించారు.

## బొమ్మ బొరుసు ఆడుతున్న వారిపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

- 13 మంది అరెస్ట్..6 గురు పరారీ.
- 14 మొబైల్ ఫోన్లు, రూ.55,375 నగదు స్వాధీనం.
- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 14(జన సంఘర్షణ)



మెదక్ జిల్లా అల్లాదుర్గ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కె.ఎన్.ఆర్. క్రషర్ వెనుక బొమ్మ బొరుసు ఆడుతున్న స్థావరంపై మెదక్ జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నిఘా ఏర్పాటు చేసి, బొమ్మ బొరుసు ఆడుతున్న స్థావరంపై దాడి నిర్వహించారు. ఈ దాడిలో బొమ్మ బొరుసు ఆడుతున్న 13 మందిని పోలీసులు అదుపులోకి తీసుకోగా, మరో 6 గురు పోలీసులను చూసి అక్కడి నుంచి పరారైనట్లు జిల్లా ఎస్పీ వెల్లడించారు. పట్టుబడిన వారి వద్ద నుంచి 14 మొబైల్ ఫోన్లు, రూ.55,375 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.పట్టుబడిన వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి తదుపరి చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా బొమ్మ బొరుసు, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడినా, నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాటికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు.

## మర్కల్ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

- డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ సేవలను స్మరించిన విద్యార్థినులు


సదాశివనగర్,/ ఆగస్టు 14/ (జన సంఘర్షణ):




కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం మర్కల్ గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత గ్రంథాలయ శాస్త్ర పితామహుడిగా పేరొందిన డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ సేవలను కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు స్మరించుకున్నారు. డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ 1892 ఆగస్టు 12న జన్మించారని, భారతదేశంలో గ్రంథాలయ శాస్త్రం, సమాచార శాస్త్ర అభివృద్ధికి ఆయన విశేష కృషి చేశారని నిర్వాహకులు తెలిపారు. గ్రంథాలయాల నిర్వహణ, పుస్తకాలను పాఠకులకు సులభంగా అందుబాటులోకి తీసుకురావడం వంటి అంశాల్లో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. భారతదేశంలో గ్రంథాలయ శాస్త్రానికి పునాదులు వేసిన ప్రముఖుల్లో రంగనాథన్ ఒకరని, ఆయన సేవలకు గుర్తింపుగా 'భారత గ్రంథాలయ శాస్త్ర పితామహుడు'లిగా గౌరవిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు గ్రంథాలయాల ప్రాధాన్యత, పఠన అలవాట్ల వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు పుస్తక పఠనాన్ని నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## త్యాగధనుల స్ఫూర్తితో దేశాభివృద్ధికి కృషి చేద్దాం

- స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ ఐక్య భారత నిర్మాణంలో భాగస్వాములు కావాలి: డా. ఎం.ఏ. హకీమ్




పోతంగల్, /ఆగస్టు 14 /

(జన సంఘర్షణ): 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పోతంగల్ మండల ప్రజలకు మాజీ కో-ఆప్షన్ సభ్యులు, సామాజిక సేవకులు, బీఆర్ఎస్ నాయకుడు డా. ఎం.ఏ. హకీమ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. వారి త్యాగాల ఫలితంగానే మనం నేడు స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని పేర్కొన్నారు. బలమైన, అభివృద్ధి చెందిన, శాంతియుతమైన, ఐక్య భారతదేశ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని డా. హకీమ్ పిలుపునిచ్చారు. దేశ సమగ్రత, ఐక్యతను కాపాడుతూ భావితరాలకు మంచి భవిష్యత్తును అందించేందుకు యువత ముందుకు రావాలని సూచించారు. "భారతీయుడిగా పుట్టినందుకు.... గర్విస్తున్నాను.. దేశం కోసం పాటుపడటమే మనందరి బాధ్యత. జై హింద్" అని డా. ఎం.ఏ. హకీమ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోతంగల్ మండల ప్రజలకు, యువతకు, విద్యార్థులకు ఆయన స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## అక్రమంగా తరలిస్తున్న 30 టన్నుల పీడీఎస్ బియ్యం లారీ పట్టివేత

- పిట్లం పోలీసుల చాకచక్యం.. ముగ్గురిపై కేసు నమోదు

కామారెడ్డి/, ఆగస్టు 14: /జన సంఘర్షణ



పేద ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న లారీని పిట్లం పోలీసులు పట్టుకున్నారు. హైదరాబాద్ నుంచి నాందేడ్ మీదుగా గుజరాత్ వైపు తరలిస్తున్న సుమారు 30 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పిట్లం ఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో సిబ్బంది వెంకటేష్, రాజేశ్వర్లు పిట్లం చౌరస్తా సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి నాందేడ్ వైపు వెళ్తున్న జీజే-25-యూ-7022 నంబర్ లారీని ఆపి తనిఖీ చేయగా, 632 పాలిథిన్ కవర్లలో సుమారు 30 టన్నుల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. దీంతో బియ్యంతో పాటు లారీని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ వ్యవహారంలో లారీ డ్రైవర్లు పర్బత్ కరంటా దేవరాజ్ (52), శరద్ ఆబా బచ్కర్, అలాగే బియ్యం తరలిస్తున్న వ్యక్తి ఇబ్రహీంపై కేసు నమోదు చేశారు. బియ్యం ఎక్కడి నుంచి సేకరించారు, ఎక్కడికి తరలిస్తున్నారు, ఈ అక్రమ రవాణా వెనుక మరెవరైనా ఉన్నారా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**పోలీసుల పనితీరుపై ఎస్పీ అభినందనలు**

పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకుని భారీగా బియ్యాన్ని పట్టుకున్న పిట్లం ఎస్ఐ ఆంజనేయులు, సిబ్బంది వెంకటేష్, రాజేశ్వర్లను జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ అభినందించారు. విధుల్లో అప్రమత్తంగా ఉంటూ అక్రమ రవాణాను అడ్డుకున్న పోలీసుల పనితీరును ప్రశంసించారు.

**పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై అధికారుల హెచ్చరిక**

ప్రభుత్వం పేదల కోసం పంపిణీ చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలించడం, నిల్వ చేయడం, విక్రయించడం లేదా ఇతర వ్యాపారాలకు మళ్లించడం చట్టవిరుద్ధమని పోలీసులు స్పష్టం చేశారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, నిల్వలు లేదా విక్రయాలపై సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు సూచించారు. పేదల హక్కైన రేషన్ బియ్యాన్ని అక్రమ వ్యాపారాలకు మళ్లిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

## కోటగిరి మండల పీఆర్టీయూ టీఎస్‌కు నూతన కార్యవర్గం

- 2026-28 కాలానికి ఏకగ్రీవ ఎన్నిక..
- ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

కోటగిరి,/ ఆగస్టు 14: /జన సంఘర్షణ




కోటగిరి మండల పీఆర్టీయూ టీఎస్ కార్యవర్గ సమావేశం శుక్రవారం మండల అధ్యక్షుడు శ్రీ బర్ల సాయిలు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా 2026--28 రెండేళ్ల కాలానికి నూతన మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలో మండల అధ్యక్షుడిగా... యు. సుధీర్, ప్రధాన కార్యదర్శిగా డి. ఉదయ్ చందర్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎం.డి. పాషా, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా బి. సురేఖ ఎన్నికయ్యారు. అదేవిధంగా ఉపాధ్యక్షుడిగా కె. రవీందర్, మహిళా ఉపాధ్యక్షురాలిగా జి. రాములమ్మ, కార్యదర్శులుగా ఎం. రాజు, ఎ. సంతోష్, మహిళా కార్యదర్శులుగా జె. రాధిక, భూలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యుల ఎన్నిక సందర్భంగా పలువురు నాయకులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, సంఘాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు విద్యారంగ అభివృద్ధికి నూతన కార్యవర్గం సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పీఆర్టీయూ అధ్యక్షులు పి. మోహన్ రెడ్డి, కోటగిరి మండల విద్యాధికారి ఎన్. శ్రీనివాస్ రావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గంగరాజు, శానం సాయిలు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.డి. అర్షద్ హుస్సేన్, ప్రాథమిక సభ్యులు, ఎమ్మార్సీ సిబ్బంది, వివిధ మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు. ఏకగ్రీవ ఎన్నికతో కోటగిరి మండల పీఆర్టీయూ టీఎస్ నూతన కార్యవర్గంలో నూతనోత్సాహం నెలకొంది. ఉపాధ్యాయుల సంక్షేమం, హక్కుల పరిరక్షణతో పాటు విద్యారంగ ప్రగతికి అంకితభావంతో పనిచేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు.

## కూరగాయల వ్యాపారులకు ప్రత్యేక స్థలం ఏర్పాటు

- కేటాయించిన స్థలాల్లోనే వ్యాపారాలు నిర్వహించాలి
- ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్

బాన్సువాడ, /ఆగస్టు 14 /(జన సంఘర్షణ):



రహదారులపై కూరగాయల విక్రయాలతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా బాన్సువాడ పట్టణంలో చిరు కూరగాయల వ్యాపారులకు ప్రత్యేక స్థలం ఏర్పాటు చేసే చర్యలను మున్సిపల్ అధికారులు చేపట్టారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి పాత బాన్సువాడ వైపు వెళ్లే ప్రధాన రహదారి పక్కన కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న వ్యాపారులకు ప్రత్యామ్నాయంగా ప్రత్యేక స్థలాన్ని కేటాయించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్ శుక్రవారం కూరగాయల వ్యాపారులతో కలిసి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాపారుల జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా, అదే సమయంలో రహదారులపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సమన్వయంతో చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వ్యాపారులందరూ మున్సిపల్ అధికారులు కేటాయించిన స్థలాల్లోనే కూరగాయల విక్రయాలు నిర్వహించాలని బాలరాజ్ సూచించారు. వ్యాపారాలు ఒకే ప్రాంతంలో కొనసాగితే ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు తగ్గడంతో పాటు వ్యాపారులకు కూడా సౌకర్యవంతమైన వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం.. కలిగించేలా రహదారులపై వ్యాపారాలు నిర్వహించవద్దని, మున్సిపల్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఆయన సూచించారు. ప్రజల సౌకర్యం, వ్యాపారుల జీవనోపాధి రెండింటినీ దృష్టిలో ఉంచుకుని అధికారులు తీసుకున్న నిర్ణయానికి వ్యాపారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది, కూరగాయల వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు విశ్వసనీయమైన సర్వే సమాచారాన్ని అందించడమే లక్ష్యంతో పునఃసర్వే

- లైసెన్స్‌డ్ సర్వేయర్లను భూ సర్వే ప్రక్రియలో భాగస్వామ్యం.
- పునఃసర్వే పని కోసం 20 మంది అర్హులైన అభ్యర్థులకు లైసెన్సులు జారీ.
- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 14 (జన సంఘర్షణ)



ప్రజలకు విశ్వసనీయమైన సర్వే సమాచారాన్ని అందించడమే లక్ష్యంతో పునఃసర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ లైసెన్స్ సర్వేయర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ చాంబర్లో జిల్లాలో పునఃసర్వే పనులు చేపట్టేందుకు నిర్దేశిత అర్హత,శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన 20 మంది అర్హులైన అభ్యర్థులకు సర్వే మరియు భూ రికార్డుల శాఖకు చెందిన సంబంధిత అధికారుల సమక్షంలో ఎంపికైన అభ్యర్థులకు లైసెన్సులను లాంఛనంగా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూమి రికార్డులను నవీకరించడం, మెరుగుపరచడం, ఖచ్చితమైన సర్వే సరిహద్దులను స్థాపించడం, మరియు భూ యజమానులకు, ప్రజలకు విశ్వసనీయమైన సర్వే సమాచారాన్ని అందించడం అనే లక్ష్యంతో పునఃసర్వే కార్యక్రమాన్ని చేపట్టాలని, లైసెన్స్ పొందిన సర్వే అభ్యర్థులు, సర్వే, భూ రికార్డుల శాఖ నిర్దేశించిన సాంకేతిక విధానాలు, నియమాలు, సూచనల ప్రకారం పునఃసర్వే కార్యకలాపాలను నిర్వహించడంలో సహాయపడతారని. సర్వేయర్లు తమ విధులను నిష్పక్షపాతంగా, కచ్చితంగా, పారదర్శకంగా నిర్వర్తించాలని, అలాగే రెవెన్యూ, సర్వే శాఖ అధికారులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడి ల్యాండ్ సర్వే కిషన్, సంబంధిత ల్యాండ్ సర్వీస్ సిబ్బంది లైసెన్స్ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
శనివారం
15 ఆగస్టు 2026

## పోతంగల్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధం

- **జెండా ఆవిష్కరణకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు ఆహ్వానం..**



పోతంగల్,/ ఆగస్టు 14: జన సంఘర్షణ

దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పోతంగల్ తహసీల్దార్ కార్యాలయంలో శనివారం (ఆగస్టు 15) స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కార్యాలయం తెలిపింది. ఈ వేడుకలకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా:.. ప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ కోరారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

వేదిక:... తహసీల్దార్ కార్యాలయం, పోతంగల్..
తేదీ: 15-08-2026
సమయం: ఉదయం 9:00 గంటలకు
మీడియా ప్రతినిధులందరూ సకాలంలో హాజరై కార్యక్రమాన్ని కవర్ చేయాలని తహసీల్దార్ కార్యాలయం విజ్ఞప్తి చేసింది.

## బి.ఎస్.పి ఎమ్మెల్యే కాంటెస్టెడ్ అభ్యర్థి మ్యాతరి సంజీవులు

- **ప్రకటించిన రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్**



కామారెడ్డి జిల్లా ఆగస్టు 14 (జన సంఘర్షణ)ప్రతినిధి

ఎల్లారెడ్డి నియోజకవర్గం ఎమ్మెల్యే కంటెస్టెంట్ అభ్యర్థిగా గాంధారి మండలం పెట్ సంగెం కు చెందిన మ్యాతరి సంజీవులు బహుజన్ సమాజ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రహీం శేఖర్ ను మర్యాదపూర్వకంగా హైదరాబాద్ పార్టీ కార్యాలయంలో కలిసి పార్టీ యొక్క సిద్ధాంతాలకు ఆకర్షితులై పార్టీలో చేరడం జరిగిందని ఎల్లారెడ్డి నియోజకవర్గం ఇన్చార్జిగా బాధ్యతలు అప్పగించిన శేఖర్ ధన్యవాదాలు తెలిపారు తనపై నమ్మకంతో బాధ్యతను అప్పగించిన అధిష్టానం కు పార్టీకి పార్టీ బలోపేతానికి ప్రజల్లోకి తీసుకెళ్తానని మనస్ఫూర్తిగా తెలియజేస్తున్నానని తనతో పాటు తన మిత్రులు కూడా పార్టీలోకి చేరినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హరిలాల్ నాయక్ ఎల్లారెడ్డి అసెంబ్లీ ఇంచార్జ్ కాన్సిరాం పాల్గొన్నారు.

## పోతంగల్ రైతువేదికలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- **ఎలక్ట్రాన్, ప్రింట్ మీడియా ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని వ్యవసాయ శాఖ విజ్ఞప్తి**




పోతంగల్, ఆగస్టు 14/జన సంఘర్షణ:

భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పోతంగల్ మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 15న రైతువేదికలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. పోతంగల్ రైతువేదికలో ఉదయం 8:30 గంటలకు జాతీయ జెండా ఆవిష్కరణతో కార్యక్రమం ప్రారంభం కానుంది. దేశ స్వాతంత్ర్య స్ఫూర్తిని స్మరించుకుంటూ, దేశ ప్రగతిని కొనియాడుతూ, అభివృద్ధి చెందిన, స్వయం సమృద్ధి భారతదేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనే సందేశాన్ని ఈ సందర్భంగా చాటిచెప్పనున్నారు. "మెరుగైన రైతులు – బలమైన భారత్.. ఆరోగ్యవంతమైన రైతులు – ఆహార భద్రత కలిగిన భారత్" అనే నినాదంతో రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి ప్రాధాన్యతను తెలియజేస్తూ వేడుకలు నిర్వహించనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఎలక్ట్రానిక్ మీడియా, ప్రింట్ మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు కోరారు.

తేదీ. : ఆగస్టు 15, 2026 సమయం: ఉదయం 8:30 గంటలకు
వేదిక: రైతువేదిక, పోతంగల్

## పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన సర్పంచ్ సుధాకర్

- **ఇంటింటికి మొక్కల పంపిణీ**
- **మధ్యాహ్న భోజన పరిశీలన**
- **ఇంకుడు గుంతలు**





కామారెడ్డి జిల్లా ఆగస్టు 14 (జనసంఘర్షణ) ప్రతినిధి

గాంధారి మండలంలోని కరక్వాడి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్టు సర్పంచ్ సుధాకర్ తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతలు ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పరిశీలన ప్రతి ఇంటికి మొక్కను చేరవేసే కార్యక్రమం స్వతంత్ర దినోత్సవ ఏర్పాట్లు వీధిలైట్ల నిర్వహణ ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం, పంచాయతీ కార్యదర్శి, స్వరూప గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బైపాస్‌కు బొక్కల వాసన.. దుర్గంధంతో ప్రయాణికుల అవస్థలు

- **రోడ్డు పక్కనే ఖళేబరాల నిల్వలు.. పట్టించుకోని అధికారులు?**
- **దుర్వాసనతో ప్రజల ఉక్కిరిబిక్కిరి.. చర్యలు తీసుకోకుంటే ఆందోళన తప్పదంటున్న స్థానికులు**



బోధన్/ఆగస్టు 14/జన సంఘర్షణ:

బోధన్ పట్టణ శివారులోని బాబా గార్డెన్ నుంచి శ్రీనివాస క్యాంప్ వైపు వెళ్లే బైపాస్ రోడ్డు పరిసరాలు బొక్కల తరలింపు, నిల్వలకు అడ్డాగా మారుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్డు పక్కనే షెడ్లు ఏర్పాటు చేసి ఖళేబరాలను నిల్వ చేస్తున్నారనే సమాచారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

**ముక్కు మూసుకుంటేనే ప్రయాణం!**

బైపాస్ రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులకు అక్కడి పరిస్థితులు తీవ్ర ఇబ్బందిగా మారాయి. ఖళేబరాల నుంచి వస్తున్నట్లు చెబుతున్న తీవ్ర దుర్గంధంతో ముక్కు, నోరు మూసుకోకుండా అటువైపు వెళ్లలేని పరిస్థితి నెలకొందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసన కారణంగా పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలు కూడా తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పక్కనే ఇలాంటి నిల్వలు కొనసాగితే పరిశుభ్రతతో పాటు ప్రజారోగ్యంపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని వారు ఆందోళన చెందుతున్నారు.

**అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల మండిపాటు**

ప్రజల రాకపోకలకు కీలకమైన బైపాస్ రోడ్డు పక్కనే ఇలాంటి కార్యకలాపాలు కొనసాగుతున్నా సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా అధికారులు కళ్లు తెరిచి క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఖళేబరాల నిల్వకు అనుమతులు ఉన్నాయా? నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తున్నారా? అనే అంశాలపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**చర్యలు లేకుంటే ఆందోళన తప్పదా?**

బైపాస్ రోడ్డును బొక్కల నిల్వ కేంద్రంగా మార్చే ప్రయత్నాలను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా కార్యకలాపాలు కొనసాగిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరిస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత కంటే ఏ వ్యాపారమూ ముఖ్యం కాదని.. అధికారులు ఇకనైనా స్పందించకపోతే ప్రజా ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.


## పైసలిస్తేనే పని.. లేదంటే ఫైలు పెండింగ్

- **పైసలిస్తేనే పని.. లేదంటే ఫైలు పెండింగ్..**
- **మ్యుటేషన్ నుంచి వారసత్వ మార్పిడి వరకు ఇదే కథ**
- **ధ్రువీకరణ పత్రాలకూ 'రేటు'**
- **భూమి వ్యవహారాల్లో మధ్యవర్తుల హవా..**
- **తనిఖీలు ఉన్నా.. తగ్గని వసూళ్లు**
- **జనగామలో బాధితులకు ముప్పతిప్పలు...**

వరంగల్/ఆగస్టు 14/జన సంఘర్షణ:

జనగామ జిల్లాలోని మండల రెవెన్యూ కార్యాలయాల్లో అవినీతి వ్యవహారాలు యథేచ్ఛగా సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజల అవసరాలు, అత్యవసర పరిస్థితులను ఆసరాగా చేసుకుని కొన్ని పనులకు మామూళ్లు వసూలు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం పూర్తి కావాల్సిన పనులు సైతం ఫైళ్లను పెండింగ్‌లో పెట్టడం.. పైసలు ముట్టజెప్పిన తర్వాతే కదిలించడం పరిపాటిగా మారిందన్న ఆరోపణలు వస్తున్నాయి. భూముల మ్యుటేషన్, వారసత్వ మార్పిడి, పట్టాదారు పాస్‌బుక్ సంబంధిత పనులు, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ, ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు తదితర సేవల్లో అక్రమ వసూళ్లకు ఆస్కారం ఉంటోందన్న ఆరోపణలు ఉన్నాయి. దరఖాస్తుల్లో చిన్నచిన్న లోపాలను చూపుతూ ప్రజలను పలుమార్లు కార్యాలయాల చుట్టూ తిప్పడం.. మధ్యవర్తుల ద్వారా పని చేయించుకుంటే మాత్రం త్వరగా పూర్తిచేయడం జరుగుతోందని పలువురు చెబుతున్నారు.

**భూమి పనులకే ఎక్కువ డిమాండ్**




రెవెన్యూ కార్యాలయాల్లో భూములకు సంబంధించిన వ్యవహారాలే ప్రధానంగా అవినీతికి ఆస్కారం కల్పిస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. వారసత్వంగా వచ్చిన భూమిని కుటుంబ సభ్యుల పేర్లపై మార్చడం, రికార్డుల్లో మార్పులు చేయడం, భూ వివరాల పరిశీలన, ధ్రువీకరణ, వివిధ రకాల నివేదికల కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు 'ఖర్చులు' పేరుతో డబ్బులు అడుగుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. పని ఆలస్యమవుతుందని చెప్పి ఒత్తిడి చేయడం.. చివరకు ఎంతోకొంత ఇచ్చిన తర్వాత ఫైలు ముందుకు కదులుతుందన్న విమర్శలు ఉన్నాయి. కొన్ని మండల కేంద్రాల్లో రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే మధ్యవర్తుల వ్యవస్థ కూడా అవినీతికి ఊతమిస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రజలకు నేరుగా అందాల్సిన సేవలకు కూడా మధ్యవర్తుల ద్వారా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని అంటున్నారు. దరఖాస్తు నుంచి ఫైలు క్లియరెన్స్ వరకు ఒక్కో దశకు ఒక్కో రేటు నిర్ణయించినట్లుగా వ్యవహారం సాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**తనిఖీలు ఉన్నా.. తగ్గని వసూళ్లు**

రెవెన్యూ కార్యాలయాల్లో అవినీతిని అరికట్టేందుకు ఉన్నతాధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రజలకు అందాల్సిన సేవలను నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలో అందించడంతో పాటు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న సిబ్బంది, మధ్యవర్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను ఉన్నతాధికారులు ప్రత్యేకంగా పరిశీలించి, ప్రతి సేవకు నిర్ణయించిన రుసుము, సమయ పరిమితిని కార్యాలయాల్లో స్పష్టంగా ప్రదర్శించాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఘనంగా జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే జన్మదిన వేడుకలు

మద్నూర్/ఆగస్టు 14: జన సంఘర్షణ

జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే జన్మదిన వేడుకలు అభిమానులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సందడితో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన అభిమానులు, నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. హనుమంత్ షిండే ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజల సమస్యలపై స్పందించే నాయకుడిగా మరింతకాలం ప్రజాసేవ కొనసాగించాలని పలువురు ఆకాంక్షించారు. ఆయన ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నారు.

**మద్నూర్ మండల కేంద్రంలోనూ సందడి**

మద్నూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, నాయకులు, కార్యకర్తలు, అభిమానుల ఆధ్వర్యంలో హనుమంత్ షిండే జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అభిమానుల నినాదాలు, కార్యకర్తల ఉత్సాహం మధ్య వేడుకలు సందడిగా కొనసాగాయి. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్



నాయకులు, తేల రవికుమార్, పొతంగల్ అధ్యక్షుడు, సుద్దాం నవీన్ , మద్దూరు మాజీ సర్పంచ్ , కృష్ణ పటేల్, విలేకర్ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## పోతంగల్‌లో బీఆర్ఎస్ జెండా ఆవిష్కరణకు సర్వం సిద్ధం

- **స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయం వద్ద కార్యక్రమం**
- **నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరు కావాలని మండల అధ్యక్షుడు సుధాం నవీన్ పిలుపు**



పోతంగల్,/ ఆగస్టు 14/జన సంఘర్షణ:

భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పోతంగల్ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద ఆగస్టు 15న జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుధాం నవీన్ తెలిపారు. శనివారం ఉదయం 8:30 గంటలకు జెండా ఆవిష్కరణ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జాతీయ జెండాకు గౌరవం చాటాలని ఆయన కోరారు.

**సకాలంలో చేరుకోవాలి...**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రతి ఒక్కరూ సకాలంలో పార్టీ కార్యాలయానికి చేరుకుని వేడుకలను విజయవంతం చేయాలని సుధాం నవీన్ పిలుపునిచ్చారు. "జై తెలంగాణ.. జై జై తెలంగాణ" నినాదాలతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశభక్తి సందేశాన్ని ప్రజలకు చాటిచెప్పనున్నట్లు పేర్కొన్నారు.

తేదీ: 15-08-2026, శనివారం సమయం: ఉదయం 8:30 గంటలకు
వేదిక:....బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం, పోతంగల్ మండల కేంద్రం. ఇట్లు, మీ సుధాం నవీన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, పోతంగల్ పేర్కొన్నారు.

Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co